# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 270 | హైదరాబాద్ | బుధవారం 22-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత 8లో




- ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విఫలం
- సమ్మెలోకి 39 వేల మంది ఆర్టీసీ కార్మికులు
- హడావిడిగా ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- జేఏసీని నాలుగు వారాల గడువు కోరిన కమిటీ
- తిరస్కరించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు
- మా డిమాండ్లన్నీ పాతవేనని స్పష్టీకరణ
- నిలిచిపోనున్న 10వేల ఆర్టీసీ సర్వీసులు

11లో

## సొంతగడ్డపై సన్ రైజర్స్ హ్యాట్రిక్..
# ఢిల్లీపై అద్భుత విజయం

- హైదరాబాద్‌లో పరుగుల వరద.. ఢిల్లీపై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ విజయం
- విధ్వంసకర సెంచరీతో అదరగొట్టిన ఓపెనర్ అభిషేక్ శర్మ
- బౌలింగ్‌లో మలింగ, హర్ష్ దూబే మాయ
- ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరిన ఎస్‌ఆర్‌హెచ్

11లో






## ముగిసిన ప్రచారం.. 11లో
# ఇక ఓటరు తీర్పే తరువాయి

- తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్
- బెంగాల్‌లో 152 స్థానాలకు పోలింగ్
- మే 4వ తేదీన వెల్లడి కానున్న ఫలితాలు

## కేరళలో బాణసంచా పేలుడు
# 13 మంది మృతి

- త్రిస్సూర్ పూరం వేడుకల్లో భారీ పేలుడు
- ఘటనలో 13 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం
- అప్రమత్తమైన కేరళ ప్రభుత్వం, సహాయక చర్యలు ముమ్మరం
- ఘటనపై విచారణకు ఆదేశించిన అధికారులు

11లో





## గులాబీ బాస్ కీలక భేటీ

- ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశం
- పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా భేటీ
- భవిష్యత్ పోరాటాలకు శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్న గులాబీ బాస్

11లో

## ఇరాన్‌కు మరోసారి
# ట్రంప్ హెచ్చరిక

- కాల్పుల విరమణ పొడిగించడం ఇష్టంలేదన్న ట్రంప్
- ఇరాన్‌కు చర్చలు తప్ప మరో మార్గం లేదని వ్యాఖ్య
- విరామ సమయంలో అదనపు ఆయుధాలను సమకూర్చుకుంటామని వెల్లడి

11లో



# హైడ్రా ముందు అమీన్‌పూర్ బాధితుల ఆర్తనాదం

- ముఖీం అనుచరుల చేతిలో మోసపోయాం.. మాకు న్యాయం చేయండి
- 'హైడ్రా' ప్రజావాణిలో పేదల మొర

12లో



# ఐటీ ఉద్యోగుల మెడపై ఏఐ కత్తి.. మరో 3 లక్షల మంది ఔట్?

2026 తొలి త్రైమాసికంలో టెక్ రంగం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఈ 2026 మొదటి మూడు నెలల్లోనే 73 వేల మందికి పైగా టెకీలు ఉద్యోగాలు కోల్పోయారు. మెటా, ఒరాకిల్, స్నాప్ చాట్ వంటి దిగ్గజ కంపెనీలు భారీగా లేఆఫ్స్ చేశాయి. మెటా కంపెనీ ఇటీవలే 8 వేల మందిని తొలగిస్తున్నట్లు తెలిపింది. ఏఐతో భర్తీ చేస్తూ ఖర్చులను తగ్గించుకునేందుకు కంపెనీలు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఈ ఏడాది చివరి నాటికి 3 లక్షల మందికి ఉపాధి పోవచ్చనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అంటే ఒకప్పుడు యువత కలల జాబ్. కానీ ఇప్పుడు అంతా తారుమారు అయింది. ఐటీ ఉద్యోగం అంటే ఎప్పుడు ఊడిపోతుందో చెప్పలేని పరిస్థితి వచ్చింది. టెక్ రంగానికి 2026 సంవత్సరం ఒక పీడకలలా మారిపోతోంది. ఎందుకంటే గత మూడు నెలల్లోనే 95 కంపెనీలు 73,200 మందికి పైగా ఐటీ, టెక్ ఉద్యోగులను తొలగించాయి. ఇది ఇక్కడితోనే ఆగిపోయేలా కనిపించడం లేదు. ఏప్రిల్‌లో స్నాప్, ఒరాకిల్, డిస్నీ, మెటా వంటి ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజాలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది 2026 చివరి నాటికి ఉద్యోగుల తొలగింపుల సంఖ్య 3 లక్షలకు చేరవచ్చనే అంచాలను ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు కంపెనీలు వృద్ధి గురించి మాట్లాడితే కేవలం ఏఐ ఎఫిషియన్సీ జపం చేస్తున్నాయి. తమ ఉద్యోగులకు స్నాప్ సీఈఓ ఇవాన్ స్పీగెల్ పంపిన మెమోలో ఓ పచ్చి నిజాన్ని నివేదించారు. ఉద్యోగాల కోత కంపెనీకి ఒక అగ్ని పరీక్షగా అభివర్ణించారు. ఏఐ టూల్స్‌తో తక్కువ మందితోనే ఎక్కువ పని చేయించవచ్చని, దీంతో ఏడాదికి 500 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయని తెలిపారు. అంటే, మనుషుల కంటే మెషీన్ల ద్వారానే చౌకగా పనులు పూర్తి చేయవచ్చని టెక్ కంపెనీలు భావిస్తున్నాయని ఆయన మాటల్లో అర్థమవుతోంది. మరోవైపు.. టెక్ దిగ్గజం ఒరాకిల్ వ్యవహరించిన తీరు ప్రస్తుతం ఐటీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మార్చి 31న దాదాపు 30 వేల మంది ఉద్యోగులకు ఉదయం 6 గంటలకే టెర్మినేషన్ మెయిల్స్ పంపించి షాక్ ఇచ్చింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఈ భారీ కోతలు విధించడం గమనార్హం. కంపెనీ తన పెట్టుబడులను ఏఐ డేటా సెంటర్ల వైపు మళ్లించడమే ఇందుకు ప్రధాన కారణం. ఇక డిస్నీ కొత్త సీఈఓ జోష్ డి అమారో సైతం తన బాధ్యతలు చేపట్టిన ఒక్క నెలలోనే స్టూడియోలు, ఈఎస్‌పీఎన్ విభాగాల్లో ఉద్యోగుల తొలగింపులూ మొదలుపెట్టారు. నిజానికి చాలా కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగాలు పోతున్నాయని అంటున్నా ఇది కొంత వరకు ఖర్చుల కోత కోసం ఆడుతున్న నాటకం అని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలు ఉండాలంటే ఏఐ టూల్స్‌పై పట్టు సాధించడం ఏకైక మార్గంగా చెబుతున్నారు. ఒకవైపు కంపెనీలు లేఆఫ్స్ ప్రకటిస్తూనే మరోవైపు వేల సంఖ్యలో ఉద్యోగ ప్రకటనలు చేస్తుండడం గమనార్హం. వీటిని ఘోస్ట్ జాబ్స్ గా చెబుతున్నారు. అంటే నిజానికి ఆ ఉద్యోగాలు భర్తీ చేయరని, కంపెనీ ఇంకా వృద్ధి చెందుతోందని ఇన్వెస్టర్లను నమ్మించేందుకు ఇలా చేస్తున్నారని ఐటీ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారి. ఇది నిరుద్యోగులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అది మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు, ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం. కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరందుకున్నది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు విస్తృతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లీష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఏఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైంది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెనుముప్పు కలిగించే అవకాశం ఉన్నది. భాష నేర్చుకోవలసిన అవసరం లేదనే భావన మనలో ఏర్పరుస్తున్నది. అందుకే టెక్నాలజీని నేర్పుగా వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సాంస్కృతిక సందర్భం గుర్తెరగాలి. ఇది సామాజిక సంబంధాలను నిలిపే సాధనం. కానీ వ్యక్తిత్వ ఎదుగుదలకు సోపానం. నూతన ఆలోచనా ప్రపంచాలను చేరువచేసే మార్గం. భాష నెమ్మదిగా వంటబడుతుంది. ఇలా నేర్చుకోవడంలో భావోద్వేగం, మానవతలు మిళితమై ఉంటాయి. ఇదే నిజమైన భాషా పండిత్య సాధనకు సోపానం. దీర్ఘకాల ప్రయత్నంతోనే భాషా పటిమ పట్టుబడుతుంది. ఈ సాధనే భాష సజీవంగా నిలిచి వెలిగేలా చేస్తుంది. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలుదాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. అమెరికాలో జరుగుతున్న భారీ లేఆఫ్స్ ప్రభావం భారత్‌లోని ఆఫ్‌షోర్ సెంటర్లపైనా పడుతోంది. అమెరికాలో ఒక ఉద్యోగం పోతే భారత్‌లో 3-4 ఉద్యోగాలపై ఆ ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్‌లోని సర్వీస్ బేస్డ్ కంపెనీలపై ఉంటుంది.

# శ్రీకాకుళంలో మహానాడు...

శ్రీకాకుళం, ఏప్రిల్ 21,

టీడీపీకి అత్యంత కీలకమైన మహానాడును ఈ ఏడాది ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంలో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే.. దీనిపై అధికారికంగా ప్రకటన రావలసి ఉంది. ఇక, శ్రీకాకుళంలో ఇప్పటికే దీనిపై ఏర్పాట్లు కూడా ముమ్మరం చేస్తున్నారు. ఈ దఫా 3-5 లక్షల మంది వరకు కార్యకర్తలు వస్తారన్న అంచనాలువున్నాయి. దీంతో ఆ రేంజ్‌లోనే ఏర్పాట్లను కూడా ముమ్మరం చేస్తున్నారు. రీజనేంటి..? శ్రీకాకుళంలో మహానాడును నిర్వహించేందుకు మూడు కారణాలు కనిపిస్తున్నాయి.

1) ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం: ఇతర జిల్లాలలతో పోల్చుకుంటే.. ఉత్తరాంధ్రలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా మహిళా ఓటర్ల సంక్య ఎక్కువగా ఉంది. దీంతో ఇక్కడ మరింత బలపడేందుకు అవకాశం ఉంటుందని పార్టీ అంచనా వేసింది. 2) యువతకు ప్రాధాన్యం: ఉత్తరాంధ్రలో జనాభా లెక్కల ప్రకారం.. యువ త ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వీరిని ఆకర్షించేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇక్కడ మహానాడుకు సిద్ధమైంది. అదేస మయంలో ఏటా ప్రాంతాలను కూడా మారుస్తున్న క్రమంలో గతంలో రాయల సీమలో నిర్వహించారు. ఈ దఫా ఉత్తరాంధ్రకు ప్రాధాన్యం ఇచ్చారు. 2027లో మళ్లీ గుంటూరులోను, 2028లో సీమలోనూ నిర్వహించేలా ప్లాన్ చేసినట్టు సమాచారం.

3) అభివృద్ధి: అభివృద్ధి పరంగా ఉత్తరాంధ్రకు ఇటీవల కాలంలో ఎక్కువగా ప్రాధాన్యం దక్కింది. భోగాపురం విమానాశ్రయంతోపాటు.. శ్రీకాకుళంలోని ఉద్దానంలో కిడ్నీ వైద్య శాలల ఏర్పాటు.. విశాఖలో ఐటీ సహా.. డేటా కేంద్రాలు.. వంటివి విరివిగా వస్తున్నాయి. ఈ అభివృద్ధిని చాటి చెప్పేందుకు కూడా మహానాడును వేదికగా చేసుకునేందుకు టీడీపీ ప్రయత్నిస్తోంది. ఈ మూడు కారణాలతోనే శ్రీకాకుళంలో మహానాడుకు ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది.

మహానాడు కేంద్రంగా బాధ్యతలు

తెలుగుదేశం పార్టీకి భవిష్యత్తు ఆశా కిరణంగా నారా లోకేష్ ఉన్న సంగతి తెలిసిందే. ఆయన తండ్రి చాటు బిడ్డగా రాజకీయాల్లోకి ప్రవేశించి ఈ రోజున ఇంతింతై వటుడింతై అన్నట్లుగా టీడీపీలో సర్వం తానై అన్నట్లుగా ఎదిగారు. ఆయన గడచిన దశాబ్ద కాలంలో రాష్ట్రం మీద తనదైన ముద్రను బలంగా వేశారు. నారా లోకేష్ ని పప్పు అన్న వారే నిప్పు అనుకునేలా ఆయన తనను తాను సాన పట్టుకున్నారు. అందుకే నారా లోకేష్ కి టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఇచ్చినా ఏ ఒక్కరి నుంచి వ్యతిరేక స్వరం కానీ అసంతృప్తి గళం కానీ వినిపించలేదు. పైగా ఎక్కడా ఎలాంటి రిమార్క్స్ కూడా సోషల్ మీడియాలో కానీ మెయిన్ స్ట్రీమ్ మీడియాలో కానీ రాకపోవడం చూస్తూంటే ఒక విధంగా లోకేష్ సాధించిన విజయం ఏమిటో అర్థం అవుతుంది. టీడీపీలో మూడవ తరం నాయకత్వం బాధ్యతలు స్వీకరించేందుకు లోకేష్ సిద్ధంగా ఉన్నారు. ఇక ఆ బాధ్యతల స్వీకరణ అన్నది కూడా చాలా సాఫీగా సాగిపోవడం విశేషం. ఒక్కసారి మూడు దశాబ్దాల వెనక్కి వెళ్తే ఎన్టీఆర్ నుంచి చంద్రబాబుకు పగ్గాలు దక్కడం వెనక ఒక పెద్ద రాజకీయ సమరమే సాగింది. కానీ ఇపుడు అలా కాదు చాలా స్మూత్ గా ఇదంతా సాగింది అంటే నారా లోకేష్ కి దక్కిన అదృష్టంగానే అంతా భావిస్తున్నారు. మరో వైపు చూస్తే లోకేష్ కూడా ఎప్పటికపుడు తనను తాను సమర్థుడిగా నిరూపించుకునే ప్రయత్నం చేస్తూ అందులో సక్సెస్ కావడం కూడా ఆయనకు ఆ పదవి వరించేందుకు ఆస్కారం ఇచ్చింది అని చెప్పాలి. టీడీపీ అధినాయకత్వం తాజాగా ప్రకటించిన జాతీయ రాష్ట్ర కార్యవర్గం ప్రమాణ స్వీకరణ ఘట్టం ఈ నెల 29న అట్టహాసంగా సాగుతుంది అని అంటున్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అది జరుగుతుందా లేదా వేరే వేదికను చూస్తారా అన్నది పక్కన పెడితే ఆ రోజున మంచి ముహూర్తంగా భావించి పార్టీ పగ్గాలను లోకేష్ స్వీకరించనున్నారు అని అంటున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ అంటే అన్ని విషయాలు లోకేష్ చూస్తారు, అత్యంత ముఖ్యమైనవి తప్పితే చంద్రబాబు దాదాపుగా పార్టీ విషయాలు అన్నీ లోకేష్ కి అప్పగించినట్లే అని అంటున్నారు. ఈసారి మహానాడు రూపకల్పన బాధ్యత అంతా వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతుంది అని అంటున్నారు. లోకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక చేసే అతి పెద్ద పార్టీ కార్యక్రమంగా ఇది ఉండబోతోంది. ఉత్తరాంధ్రాలోని నెల్లిమర్లలో ఈసారి మహానాడుని నిర్వహిస్తున్నారు. దాంతో నెల రోజులు మాత్రమే సమయం ఉన్నందున లోకేష్ పార్టీ మొత్తాన్ని సమాయత్తం చేస్తారు అని అంటున్నారు. అదే విధంగా ఈసారి మహానాడు లో ఏ తీర్మానాలు చేయాలి, ఏ అంశాలను ఫోకస్ చేయాలి అన్న విషయాలు కూడా చంద్రబాబుతో చర్చించి మరీ లోకేష్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తారు అని అంటున్నారు. ఇక రానున్న రోజులలో పార్టీ పరంగా ఏమి చేయాలన్నా కూడా నారా లోకేష్ దే అతి ముఖ్య పాత్ర అని చెబుతున్నారు. మొత్తం మీద టీడీపీలో మూడు దశాబ్దాల తరువాత నాయకత్వం విషయంలో అతి పెద్ద మార్పు రాబోతోంది. ఈసారి దానిని భారీ ఎత్తున వేడుకగా జరుపుకోవడానికి పార్టీ మొత్తం సిద్ధంగా ఉండడమే అసలైన విశేషంగా చూడాల్సి ఉంది.

# దుమ్మురేపిన బంగారు నాణేలు
## 2 కోటిన్నర విలువైన డాలర్ల అమ్మకం

తిరుమల, ఏప్రిల్ 21

అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి సన్నిధిలో బంగారు నాణేల విక్రయాలు రికార్డు స్థాయికి చేరాయి. ఆదివారం ఒక్కరోజే రూ. 70 లక్షలు, సోమవారం మరో రూ. 40 లక్షల మేర వ్యాపారం జరిగింది. తిరుమలలో మాత్రమే కాదు తెలుగు రాష్ట్రాల్లోని జ్యువెలరీ షాపులు, డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫావ్స్ కూడా కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా తిరుమలలో రికార్డు స్థాయిలో బంగారు నాణేలు విక్రయాలు జరిగాయి. తిరుమలలో శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ బంగారు, వెండి, రాగి డాలర్ల విక్రయ కౌంటర్‌లో భక్తులు భారీగా కొనుగోళ్లు జరిపారు. ఆదివారం రోజు ఏకంగా రూ.70 లక్షలు, సోమవారం రూ.40 లక్షల విలువైన డాలర్లను భక్తులు కొనుగోలు చేశారు. గతేడాది అక్షయ తృతీయ సందర్భంగా దాదాపు రూ.90 లక్షల విలువైన డాలర్లను కొనుగోలు చేయగా.. ఈ ఏడాది అంతకుమించి కొనుగోళ్లు జరిగాయి. అది కూడా బంగారం ధరలు భారీగా పెరిగినా సరే భక్తులు బంగారు నాణేలను కొనుగోలు చేశారు. అక్షయ తృతీయ గడియలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మధ్యాహ్నం వరకు ఉండటంతో భక్తులు నాణేలను కొనుగోలు చేశారు. శ్రీవారి ముద్ర ఉన్న నాణేలను కొనుగోలు చేయడం శుభప్రదమని భావించిన భక్తులు టీటీడీ విక్రయశాలలకు క్యూ కట్టారు. టీటీడీ తిరుమలలో శ్రీవారి చిత్రంతో బంగారు డాలర్లను విక్రయిస్తోంది. అలాగే వెండి, రాగి డాలర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే ఇటీవల బంగారం ధరల్లో మార్పులు చేయడంతో టీటీడీ కూడా నిబంధనల్ని మార్చాల్సి వచ్చింది. తిరుమలలో విక్రయించే బంగారు డాలర్ల ధరలు వారానికి ఒకసారి మార్చేవారు. ప్రస్తుతం బంగారం ధరలు రోజూవారీ మారుతున్నాయి. ఈ క్రమంలో టీటీడీకి నష్టం వస్తోంది.. అందుకే టీటీడీ అందుకు తగిన విధంగా మార్పులు చేశారు. మరోవైప తిరుమల శ్రీవారికి మరో భారీ విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన వైకెడి మల్లికార్జునరావు అనే భక్తుడు తన కుటుంబ సభ్యుల పేరుతో రూ.కోటి విరాళం అందజేశారు. అందులో టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.25 లక్షలు, శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు రూ.20 లక్షలు, శ్రీ వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.25 లక్షలు, బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు, శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందజేశారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో పేష్కార్ రామకృష్ణకు విరాళం డీడీలను అందజేశారు.

# వేటగాళ్ల కరెంటు ఉచ్చుకు వణ్యప్రాణి బలి..

తిరుపతి ఏప్రిల్ 21

జిల్లా, పీలేరు నియోజకవర్గంలోని యర్రావారిపాలెం మండలం, కోటకాడపల్లి కి సమీపంలోని వ్యవసాయ పొలాల్లో రైతులు, వేటగాళ్లు కలసి కరెంటు తీసి వణ్య ప్రాణులను చంపేస్తున్నారు. నెల రోజుల క్రితం రెండు మదపుటేనుగులను కరెంటు తీసి చంపేసిన ఘటన మండలంలో మరువకనే.. మంగళవారం మరో ఘటన వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. కరెంటుతో వణ్య ప్రాణులను చంపేస్తున్నా అటవీ, విద్యుత్ శాఖ, ఇతర శాఖల అధికారుల్లో ఏ మాత్రం చలనం లేక పోవడం విశేషం. ఉన్నతాధికారుల పట్టింపులేనితనంతోనే వణ్య ప్రాణులు బలైపోతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. మదనపల్లిలో చిరుత పులి, అడవి పందులు, తంబళ్లపల్లి నియోజకవర్గం లో జింకలు, శేషచల అడవుల్లో దుప్పులు, వాల్మీకి పురంలో అడవి పందులను వేటాడి చంపేసిన ఘటనలు ఉన్నాయి. అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలలో వణ్య ప్రాణాలను కరెంటు తీసి యదేచ్చగా చంపి మాంసం విక్రయాలు చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు...

# 46 మండలాల్లో తీవ్ర ఎండలు

విజయవాడ, ఏప్రిల్ 21

ఆంధ్రప్రదేశ్‌లో ఓవైపు ఎండలు, మరోవైపు వేడిగాలులు, ఉక్కపోత వాతావరణం కనిపిస్తోంది. దీనికి తోడు కొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఈ విభిన్నమైన వాతావరణ పరిస్థితుల్ని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా 46 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 29 మండలాల్లో సాధారణ వేడగాలులు వీచే అవకాశం ఉందని.. పలు జిల్లాల్లో వర్షాలు పడే ఛాన్స్ ఉందంటున్నారు. ఆంధ్రప్రదేశ్ నిప్పులకొలిమిలా మారింది.. ఓ ఎండ, వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. కోస్తాతో పాటుగా రాయలసీమల్లోని పలు ప్రాంతాల్లో వేడి గాలులు వీస్తున్నాయి. రాష్ట్రంలో ఎండ, వేడిగాలులు, ఉక్కపోత తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇవాళ 46 మండలాల్లో వేడిగాలులు తీవ్రంగా వీస్తాయని.. 29 మండలాల్లో వేడిగాలులు వీస్తాయని అంచనా వేశారు. గురువారం 54 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 15 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉంది అన్నారు. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా కొరిమన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి కొనసాగుతుంది. ద్రోణి ప్రభావంతో ఇవాళ అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపడతాయని అంచనా వేస్తున్నారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం రోజు పార్వతీపురం మన్యం జిల్లా మక్కువలో 44.2 డిగ్రీలు, కర్నూలు జిల్లా చిప్పగిరిలో 43.9 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం రోజు ఏకంగా 289 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయిఏపీలోని పలు జిల్లాల్లో వర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉంది కాబట్టి.. రైతులు, పశుకాపరులు చెట్ల కింద ఉండకూడదు. అలాగే ఎండ తీవ్రతను గమనించి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణిలు జాగ్రత్తగా ఉండాలని.. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో ప్రయాణాలు చేయకపోవడమే మంచిది అంటున్నారు. బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా టోపీ, రుమాలు ధరించాలని తెలిపారు. ప్రజలు తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పొలాలు, ఆరు బయట పనిచేసే వారు వాతావరణ మార్పులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

# జాతీయ పార్టీగా జనసేన

అనంతపురం, ఏప్రిల్ 21

జనసేన నాయకత్వం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తోంది. ఏపీలో కూటమిపరంగా అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ విస్తరణ పై సరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కేరళలో ఆ పార్టీ విస్తరణ జరిగింది. ఆ రాష్ట్రంలో వివిధ పార్టీల్లోని 200 మంది నేతలు జనసేనలో చేరడం విశేషం. జనసేన అగ్ర నేతలు నాగబాబు, రామ్ తాళ్లూరిల సమక్షంలో కేరళలో జనసేనలో చేరికలు పెరిగాయి. కేరళ నుంచి వచ్చిన వినతులు మేరకు పవన్ కళ్యాణ్ స్పందించారు. నాగబాబు తో పాటు రామ్ తాల్లూరిలను అక్కడకు పంపించారు. అయితే కేరళలో పెద్ద ఎత్తున నేతలు జనసేనలో చేరడం ఇప్పుడు కొత్త ప్రచారానికి తెరతీసింది. ముమ్ముందు జనసేన రాజకీయ ప్రయాణం దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్‌ఎప్పుడు దూకుడు రాజకీయాలు చేయలేదు. జనసేన పరంగా దూకుడుగా అడుగులు వేయలేదు. ముందుగా ఏపీలో సిద్ధాంత పరంగా ముందుకు వెళ్లారు. సంప్రదాయ రాజకీయ పార్టీ మాదిరిగా అస్సలు వ్యవహరించలేదు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితేనే కొనసాగాలని కుండబద్దలు కొట్టారు నాయకులకు. భారతీయ జనతా పార్టీ మాదిరిగా సిద్ధాంత పరంగా జనసేనను నిలబెట్టాలని చూశారు. ఈ క్రమంలో హిందుత్వ వాదాన్ని, సనాతన ధర్మ పరిరక్షణ నినాదాన్ని అందుకున్నారు. దీని వెనుక లోతైన వ్యూహం ఉంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. కానీ బలమైన సిద్ధాంతాల నడుమ అవి కొనసాగుతున్నాయి. తమిళనాడులో ద్రవిడ సిద్ధాంతం పూర్తిగా రాజకీయ పార్టీలను కబలించింది. అటువంటి చోట సనాతన ధర్మం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసి.. ఒక వర్గం ప్రజలను ఆకర్షించగలిగారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు అదే వ్యూహంతో దక్షిణాది రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పుడు కేరళలో అది వర్క్ అవుట్ అయ్యేలా కనిపిస్తోంది. పెద్ద ఎత్తున నేతల చేరిక.. తిరువనంతపురంలోజరిగిన జనసేన సమావేశంలో చాలామంది నేతలు ఆ పార్టీలో చేరారు. ప్రధానంగా నేషనల్ లేబర్ పార్టీ, హిందుస్థాన్ అవామీ మోర్చా, ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయ లోక్ దళ్, కాంగ్రెస్ పార్టీల నుంచి 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అయితే ఈ ఉత్సాహం చూస్తుంటే మాత్రం తదుపరి లక్ష్యంగా కర్ణాటక పై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. క్రమేపి తమిళనాడుతో పాటు తెలంగాణలో కూడా పార్టీ విస్తరించి.. జాతీయ పార్టీగా అవతరించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పవన్ కళ్యాణ్ భావజాలం భాషలతో పాటు ప్రాంతాలకు అతీతంగా దేశస్థాయిలో ప్రజలను ఆకట్టుకుంటుందని జనసేన నాయకత్వం భావిస్తోంది. చూడాలి మరి ఆ పార్టీ ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో..

===========

# లోకేష్ టీం రెడీ...



విజయవాడ, ఏప్రిల్ 21,

ఏ రాజకీయ పార్టీ అయినా రాణించాలి అంటే కచ్చితంగా టీం వర్క్ ఉండాలి. అధినేత ఆదేశాలను పాటించే వారు కచ్చితంగా ఉండాలి. అప్పుడే ఆ అధినేత పార్టీపై పట్టు సాధించగలరు. అయితే నందమూరి తారక రామారావు టిడిపి ఏర్పాటు చేసిన సమయంలో నమ్మకస్తులు దొరికారు. తరువాత చంద్రబాబు టీం లో కూడా కొంతమంది సీనియర్లు చేరారు. అయితే ఎన్టీఆర్ కు ఒక ప్రత్యేకత ఉంది. చంద్రబాబుకు ప్రత్యేకత మరోలా ఉంది. ఎన్టీఆర్ పార్టీ నేతలను గౌరవించేవారు. ఒక నిర్ణయం తీసుకుని పార్టీ నేతల అభిప్రాయం అడిగేవారు. చంద్రబాబు ఒక నిర్ణయం తీసుకునే ముందు పార్టీ నేతలతో చర్చించి వారి అభిప్రాయాన్ని తీసుకునేవారు. అంతిమంగా ఒక నిర్ణయానికి వచ్చేవారు. అయితే లోకేష్ మాత్రం ఇప్పుడు టీం వర్క్ ను నమ్ముకున్నారు. తనకంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకొని.. వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని ఒక నిర్ణయానికి వస్తున్నారు.నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ విషయంలో ఆయన అంచనాలు తప్పాయి. దాని పర్యవసానాలే 1995లో టిడిపి సంక్షోభం. తెలుగుదేశం పార్టీని వదులుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వాన్ని వదులుకోవాల్సి వచ్చింది. ఎన్టీఆర్ ఒక పట్టుదల మనిషి. ఏదైనా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. నిర్ణయం తీసుకున్నాక ఆలోచించరు. ఈ క్రమంలోనే చాలామంది సీనియర్లు ఆయనకు దూరం అయ్యారు. చంద్రబాబుపై వెన్నుపోటు అపవాదు వచ్చింది నిజమే. కానీ టిడిపిలో చాలామంది సీనియర్లు ఎన్టీఆర్ తో విభేదించి చంద్రబాబు వద్దకు చేరారు తప్పించి.. చంద్రబాబు వారిని ఆకర్షించారు అనలేం. అయితే ఆ ఎపిసోడ్ నుంచి గుణపాఠాలు నేర్చుకున్నారు చంద్రబాబు. అందుకే పార్టీలో సీనియర్లను గౌరవిస్తూ వచ్చారు. ముఖ్యంగా విధేయుల బృందాన్ని తన చుట్టూ ఉంచుకున్నారు. అప్పట్లో నందమూరి తారక రామారావు లో ఈ ఆలోచన లేదు. ఆయన ఎంతవరకు కాంగ్రెస్ లాంటి పార్టీ నే ఓడించాను.. తన మాట, తన గీత పార్టీ నేతలు దాటరు అని భావించారు. ఈ క్రమంలో జరిగిన తప్పిదాలతో చాలామంది నేతలు మనస్థాపానికి గురయ్యారు. ఎన్టీఆర్ కు దూరమయ్యారు.అయితే చంద్రబాబు అపర చాణుక్యుడు. రాజకీయ ప్రత్యర్థులు సైతం ఇదే మాట చెబుతారు. ఎన్టీఆర్ ఎపిసోడ్లో చాలా రకాల గుణపాఠాలు నేర్చుకున్నారు. పార్టీలో పరిస్థితిని ఆకలింపు చేసుకున్నారు. అందుకే పార్టీలో సీనియర్లను తన చెప్పు చేతల్లో ఉంచుకున్నారు. వారిని గౌరవించి ఒక రక్షణ కవచంలా మార్చుకున్నారు. అందుకే మధ్యలో వైయస్ రాజశేఖర్ రెడ్డి రూపంలో ప్రలోభాలు ఎదురయ్యాయి. ప్రజారాజ్యం పార్టీ రూపంలో ప్రత్యామ్నాయం వచ్చింది. తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపంలో ఒక ఆకర్షణ శక్తి ఉద్భవించింది. కానీ వాటన్నింటినీ పట్టుకొని నిలబడింది అంటే చంద్రబాబు చాణుక్యం. అదే టిడిపిని నిలబెట్టింది. అయితే ఇప్పుడు టిడిపిలో మూడో తరం వచ్చింది. లోకేష్ టీం రెడీ అయింది. కిలారు రాజేష్ లాంటి నేతలను ఏకంగా జాతీయ ప్రధాన కార్యదర్శి పోస్టులో పెట్టారు అంటే.. లోకేష్ ఆలోచన ఏ స్థాయికి వెళ్ళిందో అర్థం చేసుకోవచ్చు. అయితే లోకేష్ టీం కూర్పు ఇప్పటిది కాదు. గత రెండు సంవత్సరాలుగా ఇది కొనసాగుతూ వస్తోంది. చంద్రబాబు టీంకు మించి.. భవిష్యత్తు ఆలోచించి దీనిని రూపొందించినట్లు అర్థమవుతోంది.

## 26 జిల్లాల ప్రాతిపదికన
# కొత్త జోనల్ వ్యవస్థ

విజయవాడ, ఏప్రిల్ 21

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలకు సంబంధించి జోన్ల వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ ఆర్డర్-2005'ను రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో నోటిఫై చేసింది. దీంతో 1975 నాటి పాత రూల్స్ రద్దయి, కొత్త జోనల్ విధానం అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాల ప్రాతిపదికన ఈ కొత్త జోనల్ వ్యవస్థను రూపొందించారు. ఇటీవల మరో రెండు కొత్త జిల్లాలు ఏర్పడటంతో, మొత్తం 28 జిల్లాలకు అనుగుణంగా గెజిట్ సవరణ కోసం కేంద్రానికి ప్రభుత్వం తిరిగి ప్రతిపాదనలు పంపనుంది.

జిల్లా పరిధి, జోన్, మల్టీ జోన్ పరిధిలో ఏ పోస్టులు..

కొత్త నిబంధనల ప్రకారం రాష్ట్రంలో 26 జిల్లాలు, 6 జోన్లు, 2 మల్టీజోన్ల స్థాయిలో లోకల్ కేడర్ వ్యవస్థ పనిచేస్తుంది. రాబోయే 27 నెలల్లోగా అన్ని పోస్టులను ఈ కొత్త కేడర్లలోకి సర్దుబాటు చేయాలని కేంద్రం నిర్దేశించింది. విద్యా అర్హతలు, హోదాను బట్టి యూనిట్లను విభజించారు. జూనియర్ అసిస్టెంట్, అంతకంటే తక్కువ స్థాయి నాన్-గెజిటెడ్ పోస్టులు, టీచర్ పోస్టులకు జిల్లా యూనిట్‌గా ఉంటుంది. సూపర్ వైజర్ నుంచి మొదటి స్థాయి గెజిటెడ్ పోస్టుల వరకు జోన్ యూనిట్‌గా, డిప్యూటీ కలెక్టర్ స్థాయి పోస్టులకు మల్టీ జోన్ యూనిట్‌గా పరిగణిస్తారు. గతంలో రాష్ట్రస్థాయి పోస్టులుగా ఉన్నవి ఇకపై మల్టీజోన్ పోస్టులుగా మారతాయి. అయితే సెక్రటేరియట్, హెచ్‌ఓడి కార్యాలయాలు, రాజధాని ప్రాంత పోలీసు ఉద్యోగాలకు ఈ లోకల్ నిబంధనలు వర్తించవు.

ఉద్యోగ నియామకాల్లో స్థానిక రిజర్వేషన్ల విషయంలో ఏపీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. గతంలో జిల్లా స్థాయిలో 80 శాతం, జోనల్ స్థాయిలో 70 శాతం ఉన్న స్థానిక కోటాను ఇప్పుడు అన్ని స్థాయిల నేరుగా చేసే నియామకాల్లో 95 శాతానికి పెంచారు. మిగిలిన 5 శాతం మాత్రమే స్థానికేతరులకు అవకాశం ఇచ్చారు. ఒకవేళ అర్హులైన స్థానిక అభ్యర్థులు లభించకపోతే, ఆ పోస్టులను 3 సంవత్సరాల వరకు 'క్యారీ ఫార్వర్డ్' చేస్తారు. కనీసం ఒక పోస్టునైనా ఓపెన్ కేటగిరీ కింద ఉంచాలనే నిబంధనను ఇందులో చేర్చారు.

జిల్లాలవారీగా కొత్త జోనల్ వ్యవస్థ ఇలా..

మల్టీ జోన్-1.. ఇందులో జోన్ 1, 2, 3 ఉంటాయి

జోన్ 1: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలు

జోన్ 2: అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు

జోన్ 3: ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు

మల్టీ జోన్-2.. ఇందులో జోన్ 4, 5, 6 ఉంటాయి

జోన్ 4: గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలు

జోన్ 5: చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాలు

జోన్ 6: కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు

## 100 కోట్ల తేడా.. ఎన్నికల వేళ
# టీవీకే విజయ్‌కి షాక్

చెన్నై, ఏప్రిల్ 21



క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం లేదు. బలమైన సోషల్ మీడియా విభాగం లేదు. మీడియా మేనేజ్మెంట్ తెలియడం లేదు. ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. చివరికి పార్టీలోని నాయకులే అధినాయకుడి మీద విమర్శలు చేస్తున్నారు. ఫలితంగా ప్రజల్లో నమ్మకం పోతోంది. అధికారం కాదు కదా.. కనీసం గౌరవప్రదమైన సీట్లు గెలుచుకుంటే చాలు అనే స్థాయికి పార్టీ పరిస్థితి జరిగింది.తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ అధికారం కోసం డీఎంకే, అన్నా డీఎంకే తీవ్రంగా పోటీ పడుతున్నాయి. మధ్యలో టీవీకే పార్టీ కూడా వచ్చి చేరింది. దీనివల్ల తమిళనాడు రాజకీయాల్లో ఏం జరుగుతుందనేది అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. విజయ్ పార్టీ పెట్టిన తొలి రోజుల్లో పరిస్థితి బాగానే ఉండేది. కానీ ఎప్పుడైతే ఆయన భార్య, విజయ్ మీద విమర్శ చేయడం మొదలుపెట్టిందో అప్పుడే వ్యవహారం తేడాగా మారింది. అంతకుముందు ఓ సభలో కార్యకర్తలు చనిపోయారు. ఆ తర్వాత ఆయన నటించిన జన నాయకుడు అనే సినిమా విడుదలకు నోచుకోవడం లేదు. ఏకంగా సుప్రీంకోర్టు దాకా వెళ్ళినప్పటికీ అనుకూలంగా తీర్పు రావడం లేదు. ఇన్ని అవరోధాల మధ్య విజయ్ వ్యవహరిస్తున్న తీరు విచిత్రంగా ఉంది.ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో టీవీ కే విజయ్ కి మద్రాస్ హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆయన ప్రకటించిన అఫిడవిట్ లో అవకతవకలు ఉన్నాయని ఆయనకు వ్యతిరేకంగా పిటిషన్ దాకలైంది. దీనిపై వివరణ ఇవ్వాలని హైకోర్టు నోటులు జారీ చేసింది. ఇదే క్రమంలో ఎలక్షన్ కమిషన్, ఆదాయపు పన్ను శాఖలకు కూడా నోటీసులు జారీ చేసింది. విజయ్ ఎన్నికల వివరాలు పరస్పరమైన విరుద్ధ విషయాలు ఉన్నాయి. తిరుచి తూర్పు నియోజకవర్గం లో పోటీ చేస్తున్న క్రమంలో విజయ్ తన చరాస్తులను 224 కోట్లుగా చూపించాడు. పెరంబుర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న విజయ్ తన చరాస్తులను 105 కోట్లుగా చూపించాడు. ఆస్తుల వెల్లాడిలో 100 కోట్లు తేడా ఉండడాన్ని విగ్నేష్ అనే వ్యక్తి ప్రధానంగా ప్రస్తావించాడు. అతడు ఏకంగా హైకోర్టు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాడు.ఎన్నికల అఫిడవిట్ లను మొత్తం కోర్టు దృష్టికి విగ్నేష్ తీసుకెళ్లాడు. దీంతో అతడు సమర్పించిన వివరాలను మద్రాస్ హైకోర్టు క్షుణ్ణంగా పరిశీలించింది. అఫిడవిట్ లో ఇన్ని విరుద్ధ అంశాలు ఎలా ఉంటాయని విజయ్ ని ప్రశ్నించింది. మరి దీనిపై విజయ్ ఎలాంటి సమాధానం చెప్తారో చూడాల్సి ఉంది.

# కాంగ్రెస్ కంచుకోటలకు బీటలు

చెన్నై, ఏప్రిల్ 21, (

దాదాపు 50 ఏళ్ల తర్వాత లోక్‌సభ సీట్లు పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఓ ప్రయత్నం చేసింది. ప్రస్తుతం ఉన్న 543 సీట్లు 1977లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినవే. తాజాగా 130వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ స్థానాలు 816కు పెంచడంతోపాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ఈమేరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టింది. అయితే ఈ బిల్లే కాంగ్రెస్‌ను భయపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది. ఉనికే లేకుండా పోతుంది. అందుకే కాంగ్రెస్ విపక్షాలను ఏకం చేసి బిల్లును వ్యతిరేకించడంలో విజయవంతమైంది.కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో తమ అనుకూలంగా సీట్లను ఒకటిగా, వ్యతిరేక సీట్లలో ఓటర్లను విభజించి అనుకూల నియోజకవర్గాల్లో కలపడం వంటివి చేసింది. తెలంగాణలో 2008?09 పునర్విభజనలో హైదరాబాద్ హిందూ ఓటర్లను ముస్లిం బలమైన పాత్‌బస్తీ ప్రాంతాలతో కలిపి బీఆర్ఎస్, బీజేపీ ఓట్లు చీలేలా చేశారు. 90 కి.మీ. దూరంలోని తాండూర్‌ను హైదరాబాద్ లోక్‌సభ సీటుకు చేర్చి ముస్లిం ఓట్లు బలోపేతం చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళలో ముస్లిం, క్రిస్టియన్ ప్రాంతాల సీట్లు పెంచి, హిందూ బలమైన దక్షిణ కేరళలో సీట్లు తగ్గించారు. శ్రీరంగంలో బ్రాహ్మణులు గెలవకుండా విభజనలు చేశారని విమర్శలు వచ్చాయి.కేంద్రం మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ బిల్లు?2026, మహిళా రిజర్వేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల పెంపు. లోక్‌సభ సీట్లు 50 శాతం పెంచి 816?850కి, రాష్ట్రాలకు 815, యూటీలకు 35 సీట్లు కేటాయించాలని ప్రతిపాదన. జూన్‌లో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు, 84వ సవరణను సవరించి 2011 డేటాతో ముందుకు సాగాలని భావించింది. ఉత్తరప్రదేశ్‌కు 120 సీట్లు, తెలంగాణకు 25, ఏపీకు 38 సీట్లు పెరిగే అవకాశం. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సీట్లు పెరుగుతాయని కేంద్రం చెబుతోంది.తెలంగాణ, తమిళనాడు సీఎంలు దక్షిణ రాష్ట్రాల సమతౌల్యం దెబ్బతింటుందని వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఎంపీ సీట్ల మార్పు ఎమ్మెల్యే సీట్లను కూడా ప్రభావితం చేస్తుంది. ఉత్తర రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెరిగి దక్షిణానికి నష్టం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.ఇండియా కూటమి, మల్లికార్జున్ ఖర్గే దీన్ని రాజ్యాంగ విరుద్ధ కుట్రగా, బీజేపీ హైజాక్ ప్రయత్నంగా విమర్శిస్తోంది. కేసీ వేణుగోపాల్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇది జన హితమని, కాంగ్రెస్ గతంలో జనాభా ఆధారం మర్చినట్టు ఆరోపిస్తోంది.ఈ పునర్విభజన దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుంది. కాంగ్రెస్ తన 'కంచుకోటలు' కుప్పకూలుతాయని భయపడుతోంది. బీజేపీ మతపరమైన పోలరైజేషన్‌కు అనుకూలంగా మారవచ్చని ఆరోపణలు ఉన్నాయి. భవిష్యత్ ఎన్నికల్లో పార్టీల బలాలు పూర్తిగా మారే అవకాశం ఉంది.

# వ్యక్తిగత దూషణల్లో నేతలు....ఇద్దరూ... ఇద్దరే

హైదరాబాద్, ఏప్రిల్ 21

దేశంలో మిగతా రాష్ట్రాలు వేరు.. తెలంగాణ వేరు. తెలంగాణ ఉత్తి పుణ్యానికి రాలేదు. బలిదానాల మీద.. ఆత్మ త్యాగాల మీద వచ్చింది. ఆశయాల సాధన మీద ఏర్పడింది. అందుకే తెలంగాణ అంటే ఒక పౌరుషం.. తెలంగాణ అంటే బలమైన ఆశయం. తెలంగాణ అంటే పిడికిలి బిగించిన నినాదం. సబ్బండవర్ణాలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు, నిరసనలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పులు చేస్తేనే తెలంగాణ ఏర్పడింది. అతడు తెలంగాణలో నాయకులు మాట్లాడుతున్న మాటలు చూస్తే జాలి కలుగుతుంది.తెలంగాణలో మర్యాదలు ఎక్కువ గా ఉంటాయి. వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగితే తిట్టే తిట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఉద్యమాన్ని శంకించిన వారికి.. తెలంగాణ ప్రజల నుంచి ఎటువంటి తిట్లు ఎదురయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అటువంటి సామాజిక ఐక్యత తెలంగాణ ప్రజల్లో నిండి ఉంది కాబట్టి స్వరాష్ట్ర సాధన సాధ్యమైంది. అంతటి గొప్ప విద్వత్తు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న మాటలు బాధ కలిగిస్తున్నాయి. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది అనే ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయిరాజకీయ నాయకులు అధికారం కోసం మాత్రమే పాకులాడుతారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది వట్టి మాటలు మాత్రమే. ఏదో రాజకీయ ప్రాపకం కోసం అభివృద్ధి చేసినట్టు.. సంక్షేమానికి పాటుపడినట్టు కలరింగ్ ఇస్తుంటారు. లేకపోతే 2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడింది. కెసిఆర్ దిగిపోయే నాటికి రెవెన్యూ లోటుకు దిగజారింది. రేవంత్ పరిపాలనలో కూడా అదే సన్నివేశం కొనసాగుతోంది.. పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కనీసం రిటైర్మెంట్ బెనిఫిషరీస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీనిని బట్టి తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. త్యాగాల మీద ఏర్పడిన తెలంగాణ ఇలా కావడానికి ముమ్మాటికి రాజకీయ నాయకులు కారణం. అధికారకాంక్ష.. స్వార్థం.. భారీగా వెనకేసుకోవడం వంటి వాటి వల్ల తెలంగాణ సంపద మొత్తం రాజకీయ నాయకుల జేబుల్లోకి చేరిపోయింది. మద్యం అమ్మకాలు గనుక లేకుంటే తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిష్టూరంగా ఉన్నప్పటికీ ఇదే కఠిన నిజం. రాజకీయ నాయకుల వ్యవహార శైలి వల్ల తెలంగాణ పరువు పోతోంది అని చెప్పుకున్నాం కదా.. అది మరోసారి నిరూపితమైంది.. జగిత్యాల సభలో కేసీఆర్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఏం బీమారి వచ్చింది? ఏ మాయ రోగం? లాగులు ఇడ్చి కొట్టాలే.. నన్ను ఏం చేస్తావ్ నా కొడకా.. ఇటువంటి మాటలు మాట్లాడారు. వాస్తవానికి కెసిఆర్ నుంచి ఇంతకంటే గొప్పగా తెలంగాణ సమాజం ఆశించదు. కఠినంగా ఉన్నప్పటికీ ఇదే నిజం. కాకపోతే కెసిఆర్ గత సంభాషణలు ఉంటే ఆయన నోటి నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం అవుతుంది.రేవంత్ రెడ్డి కూడా ఇందులో తక్కువ తినలేదు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో జీవన్ రెడ్డిని గట్టిగానే తిట్టారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది.. జీవన్ రెడ్డి ఎందుకు మోసం చేశాడు.. అనే అంశాలపై రేవంత్ లోతుగానే మాట్లాడారు. కొన్ని సందర్భాలలో రేవంత్ రెడ్డి అదుపుతప్పారు. ఇక కెసిఆర్ ను కూడా అదే స్థాయిలో విమర్శించారు. కర్కోటకుడు అని సంబోధించారు. పాపాత్ముడు అంటూ మండిపడ్డారు.. కెసిఆర్ లాంటి ద్రోహిని వదిలిపెట్టే సవాల్ లేదని శపథం చేశారు.అటు రేవంత్ రెడ్డి, ఇటు కెసిఆర్ సీనియర్ నాయకులు. తిట్టుకుంటూనే రాజకీయమంటే అంతకు మించిన మూర్ఖత్వం ఉండదు. వ్యక్తిగత కోపాలు ఉంటే నేరుగా తేల్చుకోవాలి. అలాకాకుండా జనాన్ని ప్రభావితం చేసే విధంగా మాట్లాడటం ఎందుకు. రాజకీయాలు అంటే వ్యక్తిగత కక్షలకు వేదికలు కావు కదా.. విధానాలపరంగా నేతలను విమర్శించాలి. ఏవైనా తప్పులు చేస్తే ఎండగట్టాలి. అక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాలకు ఈడ్చాలి. అలా కాకుండా ఇలా తిట్టుకోవడం.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ఎటువంటి రాజకీయాలకు నిదర్శనమో కెసిఆర్, రేవంత్ రెడ్డి చెప్పాలి. ఇటువంటి రాజకీయాల కోసం కాదు తెలంగాణ తెచ్చుకుంది.

# రేవంత్‌రెడ్డికి గవర్నర్ మద్దతు ఎంత

హైదరాబాద్, ఏప్రిల్ 21,



తెలంగాణ మంత్రి అజరుద్దీన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్ ఈ నెల 30 లోగా ఏదైనా చట్టసభలో సభ్యుడిగా ఎన్నిక కావాల్సివుంది. అలాకాని పక్షంలో ఆయన మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. మంత్రి అజారుద్దీన్ తోపాటు ప్రొఫెసర్ కోదండరామ్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన ఫైల్ ను ఆమోదించాలని కోరారు. ప్రధానంగా మంత్రి అజారుద్దీన్ ను నామినేట్ చేసే అంశంపైనే సీఎం దృష్టిపెట్టారని చెబుతున్నారు.సాధారణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ లు యథాతథంగా ఆమోదిస్తారు. కానీ, తెలంగాణలో రాజకీయ పరిస్థితుల కారణంగా ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం పెండింగ్ లో పడిపోయినట్లు చెబుతున్నారు. మంత్రి అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ గత ఏడాది అక్టోబరు 28న తెలంగాణ మంత్రి మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానం ఆమోదించాల్సిందిగా గవర్నర్ కు సిఫార్సు చేసింది. ఇక ఆ నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేశారు. ప్రభుత్వం సిఫార్సు చేయడంతో అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. అజారుద్దీన్ మంత్రిగా ఉన్న సమయంలో గవర్నర్ జిష్ణుదేవ్ ఉండగా, తర్వాత ఆయన బదిలీ అయ్యారు. కొత్త గవర్నర్ గా శివప్రతాప్ శుక్లా వచ్చారు. ఈ కారణంగా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకం పెండింగులో ఉండిపోయినట్లు చెబుతున్నారు. అయితే ప్రొఫెసర్ కోదండరాంకు సంబంధించి న్యాయవివాదం ఉండటంతోనే గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో అజారుద్దీన్ పేరును సైతం ఆమోదిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గవర్నర్ ఆమోదం లభించకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే ఈ పరిణామం రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి దెబ్బగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే గవర్నర్ నిర్ణయమేంటో మాత్రం తెలియలేదు. దీంతో అజ్జుభాయ్ మంత్రి పదవిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది.

గవర్నర్ కోటాలో శాసన మండలికి పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి పట్టుబడుతున్న వారిలో ప్రొఫెసర్ కోదండరాం.. సహా.. ప్రస్తుతం మంత్రిగా ఉన్న అజారుద్దీన్ ఉన్నారు. వీరిలో అజారుద్దీన్ పరిస్థితి అత్యంత ముఖ్యంగా మారింది. ఆయన ఇప్పటికే ఆరు మాసాలుగా మంత్రిగా ఉన్నారు. కానీ, ఏ సభలోనూ ఆయన ప్రాతినిధ్యం లేదు. ఈ నెల 30 లోటా అంటే.. కేవలం 11 రోజుల్లోనే ఆయనను మండలికి సిఫార్సు చేయాల్సి ఉంది. అలా చేయకపోతే.. మంత్రిపదవిని సైతం ఆయన కోల్పోవడం ఖాయం. ఇక, కోదండరాంను ఇప్పటికే గతంలో గవర్నర్ కోటా కింద సిఫార్సు చేసినా.. అది ఫలించలేదు. ఉద్యమ నాయకుడిగా పేరుతెచ్చుకున్న కోదండరాంను సభకు పంపించడం ద్వారా.. రాజకీయ మైలేజీ ఉంటుందని రేవంత్ ఆశలు పెట్టుకున్నారు.ఈ ఇద్దరిని గవర్నర్ కోటాలోనే మండలికి పంపించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో.. కేంద్రం చెప్పుచేతల్లోనే గవర్నర్‌లు పనిచేస్తున్న కారణంగా.. రేవంత్ ఆశలు ఫలిస్తాయా? అనేది ప్రశ్న. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# షర్మిల సైతం పాదయాత్ర.. పునరాలోచనలో జగన్

కడప, ఏప్రిల్ 21,



రాజకీయాల్లో పాదయాత్రలు కొత్త కాదు. కానీ పాదయాత్ర మొదలు పెట్టింది వైయస్ రాజశేఖర్ రెడ్డి. వరుసగా రెండుసార్లు ఓటమితో ఏపీలో పూర్తి నిర్వేదంతో ఉండేది కాంగ్రెస్ పార్టీ. దేశంలో అయితే దాదాపు పది సంవత్సరాలకు పైగా అధికారానికి దూరంగా ఉండేది. అటువంటి సమయంలో పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాగలిగారు మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి. అయితే ఆయన తరువాత ఎంతోమంది పాదయాత్రలు చేసి అధికారంలోకి వచ్చారు. చంద్రబాబుతో పాటు జగన్ మోహన్ రెడ్డి ఈకోవలోకి చేరుతారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి సైతం పాదయాత్ర చేసి అక్కడ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. అయితే ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు పాదయాత్ర అనేది అధికారం తెచ్చిపెట్టి ఒక జడ పదార్థంగా మారింది. అందుకే ఇప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి మరోసారి వైసీపీని అధికారంలోకి తెచ్చేందుకు వ్యూహరచన చేస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఆయనకు తన సోదరి షర్మిల నుంచి పిడుగు లాంటి వార్త వచ్చింది.గతంలో షర్మిల పాదయాత్ర చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన తర్వాత ఆయన అక్రమాస్తుల కేసుల్లో జైలుకు వెళ్లిపోయారు. అయితే కొంతవరకు పాదయాత్ర చేసిన తర్వాత జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ జరిగింది. అటు తరువాత షర్మిల ఆ పాదయాత్ర బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాదయాత్ర చేశారు. జగన్మోహన్ రెడ్డి లేని లోటును తీర్చారు. ఒక విధంగా 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 67 సీట్లు తెచ్చుకోవడానికి షర్మిల పాదయాత్ర కూడా ఒక కారణం. అయితే షర్మిల పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకొని 2017లో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. అలా వచ్చిన తర్వాత షర్మిలను పట్టించుకోవడం మానేశారు. దీంతో షర్మిల జగన్మోహన్ రెడ్డిని కేవలం కుటుంబ పరంగా కాదు రాజకీయంగాను విభేదిస్తూ వచ్చారు. ఇప్పటికీ విభేదిస్తూ వస్తున్నారు.

వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీ అధికారంలోకి రావాలి. రాకపోతే చాలా ఇబ్బంది కరం కూడా. అందుకే జగన్మోహన్ రెడ్డి సుదీర్ఘకాలం పాదయాత్రకు ప్లాన్ చేశారు. వచ్చే ఏడాది వైయస్సార్ జయంతి రోజున పాదయాత్రను ప్రారంభించి 2029 ఎన్నికల ముంగిట ముగించాలని ప్రణాళిక వేశారు. కానీ ఇప్పుడు షర్మిల సైతం పాదయాత్ర చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. సరిగ్గా జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసే సమయానికి తాను మొదలు పెట్టాలని షర్మిల భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షర్మిల ద్వారా జగన్మోహన్ రెడ్డికి ఎంతలా పొలిటికల్ డ్యామేజ్ జరిగిందో తెలియంది కాదు. అందుకే షర్మిల పాదయాత్ర అంటేనే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి బెంబేలెత్తిపోతున్నారు. అయితే త్వరలో షర్మిల తన పాదయాత్ర షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ షర్మిల పాదయాత్ర ప్రారంభిస్తే మాత్రం జగన్మోహన్ రెడ్డికి కష్టమని వైసిపి శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి.

==========================

# తెలంగాణలో పెరగనున్న భూముల ధరలు

హైదరాబాద్, ఏప్రిల్ 21,

తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం పెరగనుండగా.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు కానున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను స్వల్పంగా పెంచి.. కమర్షియల్ స్పేస్ రేట్లను మాత్రం తగ్గించాలని ప్రతిపాదించారు. రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా రియల్ రంగంలో పారదర్శకత రానుంది.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది.ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్ విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వ లెక్కల్లో రూ. 20 లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచనున్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ. 2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగినప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదించారు. ఎస్ఎఫ్‌టీకి రూ. 7 వేలు ఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.



==========================

# 3 బీహెచ్‌కే కంప్లల్సరీ అంటున్న హైదరాబాదీలు..

హైదరాబాద్, ఏప్రిల్ 21, (న్యూస్ పల్స్)

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు మునుపెన్నడూ లేని విధంగా కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు 'సొంత ఇల్లు' అంటే 2 బీహెచ్‌కే అనేది మధ్య తరగతి కలగా ఉండేది, కానీ ఇప్పుడు ఆ ఆలోచనా ధోరణిలో స్పష్టమైన మార్పు వచ్చింది. కేవలం తల దాచుకోవడానికే కాకుండా, ఇంటిని ఒక ఆఫీసుగా, వినోద కేంద్రంగా మార్చుకోవాలనే తపన హైదరాబాద్ వాసుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.



4బీహెచ్‌కే లే హాట్ కేకులు! హైదరాబాద్ మహానగరం ఇప్పుడు కేవలం ఐటీ హబ్‌గానే కాదు.., లగ్జరీ రియల్ ఎస్టేట్ రాజధానిగా కూడా అవతరిస్తోంది. గతంలో ఇల్లు అంటే కేవలం బెడ్రూంలు, హాల్ మాత్రమే అనుకునే వారు, కానీ కొవిడ్ తర్వాత మారిన జీవనశైలి ప్రజల ప్రాధాన్యతలను పూర్తిగా మార్చేసింది. నేడు కొనుగోలుదారులు చిన్న ఇళ్ల కంటే విశాలమైన 3బీహెచ్‌కే లేదంటే 4బీహెచ్‌కే ఫ్లాట్ల వైపునకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా కోకాపేట నుంచి తెల్లాపూర్ వరకు ఆకాశహర్మ్యాలు వెలుస్తూ, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఈ మార్పు రావడానికి ప్రధాన కారణం 'వర్క్ ఫ్రమ్ హోమ్' లేదా 'హైబ్రిడ్ వర్కింగ్' మోడల్. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కార్పొరేట్ ఉద్యోగులు రోజుకు కనీసం 8 నుంచి10 గంటలు ఇంటి నుంచే పని చేయాల్సి వస్తోంది. దీంతో బెడ్రూమ్‌లో కూర్చొని పని చేయడం కంటే, ఏకాంతంగా ఉండే ఒక ప్రత్యేకమైన ఆఫీస్ గది అవసరమని భావిస్తున్నారు. అందుకే 2బీహెచ్‌కే లో సరిపెట్టుకోకుండా, అదనంగా ఒక గది ఉండేలా 3బీహెచ్‌కే లేదా 4బీహెచ్‌కే కావాలని కోరుకుంటున్నారు. ఆ నాలుగో గదిని ఆఫీసుగానో, లైబ్రరీగానో లేదా కిడ్స్ ప్లే ఏరియాగానో వాడుకుంటున్నారు. హైదరాబాద్ నగరంలోని పడమర (భాగం ఇప్పుడు లగ్జరీ నిర్మాణాలకు చిరునామాగా మారింది. కోకాపేట, నార్సింగి, తెల్లాపూర్, గండిపేట వంటి ప్రాంతాల్లో చదరపు అడుగు ధర ?9,000 నుంచి ?15,000 వరకు ఉన్నప్పటికీ, డిమాండ్ ఏమాత్రం తగ్గడం లేదు. కోకాపేటలో వెలుస్తున్న నియోపోలిస్ వంటి అత్యాధునిక లేఅవుట్లు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో క్లబ్ హౌస్‌లు, ఒలింపిక్ సైజ్ స్విమ్మింగ్ పూల్స్, విశాలమైన బాల్కనీలు, గ్రీన్ జోన్స్ ఉండడం సంపన్న వర్గాలను, సీనియర్ ఐటీ ప్రొఫెషనల్స్‌ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ప్రజలు ఇల్లు కొనేటప్పుడు కేవలం ప్రస్తుత అవసరాలనే కాకుండా, రాబోయే 10-15 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుంటున్నారు. ఉమ్మడి కుటుంబాల సంస్కృతి మళ్లీ కొంత మేర పెరుగుతుండడం లేదా తల్లిదండ్రులు, అతిథులు వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఉండాలని పెద్ద ఇళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. చిన్న ఇళ్ల కంటే పెద్ద లగ్జరీ ఇళ్లకు భవిష్యత్తులో రీసేల్ వాల్యూ ఎక్కువగా ఉంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. రియల్ ఎస్టేట్ నిపుణుల అంచనా ప్రకారం, 2026 చివరి నాటికి హైదరాబాద్‌లో అమ్ముడయ్యే మొత్తం ఫ్లాట్లలో 60 శాతానికి పైగా 3బీహెచ్‌కే , అంతకంటే పెద్దవే ఉండే అవకాశం ఉంది. ఇది హైదరాబాద్‌ను ముంబై, బెంగళూరు వంటి నగరాల కంటే ఖరీదైన మార్కెట్‌గా మారుస్తోంది. కేవలం మధ్యతరగతి మార్కెట్ నుండి 'ప్రీమియం మార్కెట్' వైపు హైదరాబాద్ అడుగులు వేస్తోంది. ఈ లగ్జరీ ట్రెండ్ నగర ప్రతిష్టను పెంచుతున్నప్పటికీ, సామాన్యుడికి మాత్రం గగనం అవుతోంది. భూముల ధరలు పెరగడంతో బిల్డర్లు కూడా చిన్న ఇళ్ల కంటే లాభాలు ఎక్కువగా వచ్చే పెద్ద ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ?50-60 లక్షల బడ్జెట్‌లో ఇల్లు దొరకడం అనేది ఇప్పుడు హైదరాబాద్‌లో అసాధ్యంగా మారిపోయింది. ఏదేమైనా, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఇప్పుడు తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకుంది.

# ఆర్థిక ఆయుధంగా ఇరాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

ఇరాన్?అమెరికా మధ్య ఉద్రిక్తతలు హార్మ్యూజ్ జలసంధిని కేంద్రంగా మరింత తీవ్రస్థితి చేరాయి. చర్చలు విఫలమై, ఇరాన్ జలసంధిపై కఠిన నియంత్రణలు ప్రకటించింది. ప్రపంచ చమురు సరఫరా దీనిపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఆర్థిక ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో 21 గంటల సుదీర్ఘ చర్చలు ఫలితం లేకుండా ముగిశాయి. అమెరికా అణు కార్యక్రమంపై 20 సంవత్సరాల ఫ్రీజ్, జలసంధి దిగ్బంధనాలు డిమాండ్ చేసింది. ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా 'అర్థరహిత' షరతులను తిరస్కరించి, యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ చేసింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఇరాన్‌కు బ్యాడ్ న్యూస్' అని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరాన్ శత్రుదేశాలకు షాక్ ఇచ్చేలా కొత్త చట్టం రూపొందిస్తోంది.ఇరాన్ సంయుక్త సైనిక ఆదేశాలు జలసంధిని తమ పూర్తి నియంత్రణలో ఉంచుతూ, అమెరికా దిగ్బంధనాలు ఉన్నంతకాలం రవాణాను అడ్డుకుంటామని ప్రకటించాయి. గత 50 రోజుల్లో ఆంక్షలు విధించి, ఇటీవల తెరిచినా మళ్లీ మూసివేశారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు ఇది కీలయం. తాజా నిర్ణయంతో చమురు రవాణాకు బ్రేక్ పడింది.పార్లమెంటరీ సివిల్ ఇంజనీరింగ్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రెజాయ్ కూచీ ప్రకటించిన ముసాయిదా తుది దశలో ఉంది. ఇజ్రాయెల్ సంబంధ నౌకలపై పూర్తి నిషేధం ఉంటుంది. హర్మ్యూజ్ దాటాలంటే జాతీయ భద్రతా మండలి అనుమతి తీసుకోవాలి. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించకపోతే ప్రయాణానికి అనుమతి ఇవ్వరు. రవాణా రుసుము ఇరాన్ కరెన్సీలో మాత్రమే చెల్లించాలి. భద్రత 'ఉచితం కాదు' అని ఉపాధ్యక్షుడు మహ్మద్ రెజా ఆరిఫ్ హెచ్చరించారు.

ఇరాన్ నిర్ణయంతో చమురు ధరలు 100?120 డాలర్ల వరకు రికార్డు స్థాయిలు చేరాయి. హర్మ్యూజ్ మూసివేతతో 20 శాతానికిపైగా పెరిగే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి 40 శాతంపైగా చమురు దిగుమతి చేసుకునే భారత్ ఇప్పుడు ఆఫ్రికా, రష్యా నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుటటోంది. మరోవైపు పెట్రోల్?డీజిల్ ధరలు 15?90 శాతం పెరిగాయి. చైనా, యూరప్‌లో కూడా ఇంధన కొరత పెరుగుతోంది. మధ్యప్రాచ్య చమురుపై ఆధారపడి ఉన్న భారత్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశతాకుతాయి.ఇరాన్ ప్రతీకార వ్యూహం ఆర్థిక ఆయుధంగా మారింది. చర్చలు ఆలస్యమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు. భారత్ వంటి దేశాలు వైవిధ్యమైన మూలాలపై దృష్టి పెట్టాలి.

# కాంగ్రెస్ సీఎం.. ఎన్డీఏ నేతలతో స్నేహం

హైదరాబాద్, ఏప్రిల్ 21,

జాతీయ రాజకీయాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెంటర్ ఆఫ్ ద అట్రాక్షన్ గా నిలుస్తున్నారు. ఎన్డీఏ నేతలతో ఆయన నెరుపుతున్న స్నేహం జాతీయ మీడియాను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రధానంగా కేంద్రం తీసుకువచ్చిన డీలిమిటేషన్ బిల్లుపై తొలి నుంచి తీవ్ర వ్యతిరేక స్వరం వినిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర దక్షిణాది సీఎంలను కార్యోన్ముఖులు చేశారని అంటున్నారు. దీంతో అటు కాంగ్రెస్ పార్టీలో ఒక్కసారిగా రేవంత్ రెడ్డికి ప్రాధాన్యం పెరిగింది. ఇలాంటి మయంలో ఆయన ఎన్డీఏ నేతల విందు భేటీకి హాజరై తనదైన రాజకీయాన్ని ఆవిష్కరించారనే చర్చకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం జాతీయ రాజకీయ పరిణామాలు గమనిస్తే అధికార ఎన్డీఏ కూటమి, విపక్ష ఇండియా కూటమికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. కానీ, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఎన్డీఏ కూటమి నేతలు నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ భేటీకి హాజరుకావడం తీవ్ర చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. మహిళా బిల్లు ఓడిపోయిన కారణంగా అటు బీజేపీ పెద్దలు, ఇటు కాంగ్రెస్ నేతలు తదుపరి వ్యూహంపై సమాలోచనలు చేస్తున్న సమయంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎన్డీఏ ఎంపీలు, ఇతర నేతలతో సరదాగా గడపడమే హాట్ టాపిక్ అవుతోంది. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజులుగా ఢిల్లీలోనే ఉన్నారు. శుక్రవారం మహిళా బిల్లుపై ఓటింగ్ నిర్వహించిన కారణంగా ఆయన దేశ రాజధానిలో ఉండి విపక్షాన్ని సంఘటితం చేయడంపైనే దృష్టి పెట్టారు. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించి తమ మాట నెగ్గించుకున్నామని సంబరాలు చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన శనివారం ఉదయం ఏపీకి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఇంటికి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది ఎంపీలకు కేంద్ర మంత్రి విందు ఏర్పాటు చేయగా, ఈ కార్యక్రమానికి మంత్రులు రామ్మోహననాయుడు, కుమారస్వామి హాజరయ్యారు. అదేవిధంగా ఏపీకి చెందిన పలువురు టీడీపీ సీనియర్లు వెళ్లారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి కూడా వారిని కలిసేందుకు మంత్రి శ్రీనివాసవర్మ నివాసానికి వెళ్లారని అంటున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణకు చెందిన బీజేపీ నేత లక్ష్మణ్ కూడా హాజరయ్యారు. అంతా కలిసి సరదాగా మాట్లాడుకున్నారు. రాజకీయానికి అతీతంగా జరిగిన ఈ కార్యక్రమానికి చెందిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. విభిన్న రాజకీయ వేదికల్లో ఉన్న ముఖ్య నేతలు ఒక చోట కలుసుకోవడం, సరదాగా నవ్వుతో మాట్లాడుకోవడం అరుదైన సంఘటనగా వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం రేవంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడమే కాకుండా జాతీయ స్థాయిలో ఆయన ప్రాధాన్యత పెరగడంతో ఈ కార్యక్రమం కూడా అందరి దృష్టిని ఆకర్షించిందని చెబుతున్నారు.

# ధనిక రాష్ట్రం.. పేద ప్రజలు

హైదరాబాద్, ఏప్రిల్ 21,

తెలంగాణ రాష్ట్రం దేశంలో తలసరి ఆదాయం, జీడీపీ పెరుగుదల పరంగా అగ్రస్థానంలో నిలుస్తోంది. హైదరాబాద్ ప్రపంచ స్థాయి టెక్ హబ్‌గా, పరిశ్రమల నగరంగా పేరు తెచ్చుకుంటే రాష్ట్రం మొత్తంగా "ధనిక రాష్ట్రం"గా ప్రచారం కూడా బలమైంది. కానీ ఇటీవల వచ్చిన సమగ్ర సామాజిక?ఆర్థిక కుల సర్వే సమాచారం ఒక వేర్వేరు రాష్ట్రంలోని సంపద కొంత మంది కులాల, కుటుంబాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని తెలుస్తోంది. జనాభాలో 67% మంది పేదరికంలోనే మగ్గుతున్నారు. అంటే ధనిక రాష్ట్రం అంటే సంపద కొందరి చేతుల్లో మాత్రమే ఉండి, అధికారం?భూమి?అవకాశాలు కూడా వారి చేతిలోకి వెళ్లిన స్థితి.తలసరి ఆదాయం పరంగా తెలంగాణ దేశంలో మొదటి?రెండో స్థానంలో ఉండటం వాస్తవం. 2023?24 అంచనాల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం సుమారు రూ.3.5?3.8 లక్షల మధ్య ఉంది. కానీ ఈ సగటు పైన ఉండిపోతూ, ఉపాధి, ఆస్తులు, అప్పులు, విద్య, ఆరోగ్యం వంటి 42 సూచీల ఆధారంగా తయారు చేసిన సోషియో?ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్, పొలిటికల్ అండ్ క్యాస్ట్ సర్వే?2024 ( ఉఉఉ?కఇ?2024) ప్రకారం రాష్ట్ర జనాభాలో 67 శాతం మంది ప్రజలు కనీస జీవన ప్రమాణం కూడా అందుకోలేని స్థితిలో ఉన్నారు. అంటే మొత్తం ధనం కొందరి కుటుంబాల కుటుంబాల్లో మాత్రమే ఒక చక్రంలా తిరుగుతూ, మిగతా భాగానికి హక్కు బాధ్యత స్టేటస్ లేకుండా పోయింది.ప్రభుత్వం 42 సూచీల ఆధారంగా కాంపోజిట్ బ్యాక్‌వర్డ్‌నెస్ ఇండెక్స్ (సీబీఐ) తయారు చేసింది. చదువు, ఉద్యోగం, ఆదాయం, ఆస్తులు, అప్పులు, రాజకీయ ప్రాతినిధ్యం, నివాస సౌకర్యాలు, విదుద్యుత్, తాగునీరు, ఆరోగ్య సేవలు వంటివాటిని స్కోర్‌లుగా మార్చారు. ఈ స్కోర్ 0?126 మధ్య ఉంటుంది. 0 నుంచి 81 లోప తీవ్ర పేదరికం, సామాజిక?ఆర్థికంగా బాహ్యంగా వెనుకబడిన స్థితి. 81 కంటే ఎక్కువ ఉంటే సాపేక్షంగా మెరుగైన, స్థిరపడిన స్థితి. సర్వేలో 242 కులాల్లో 135 కులాలు 0?81 శ్రేణిలో ఉన్నాయి. అంటే రాష్ట్రంలోని సగానికన్నా ఎక్కువ కులాలు దీర్ఘకాలిక పేదరిక చక్రంలో ఉన్నాయి. ఈ సీబీఐ స్కోర్‌లను కులం?ప్రాంతం?జెండర్ వారీగా విశ్లేషిస్తే, ఎవరికి ఎలా అవకాశాలు అందడం లేదో స్పష్టం అవుతుంది. షెడ్యూల్డ్ కాస్ట్(ఎస్సీ)లో 97 శాతం మంది రాష్ట్ర సగటు కన్నా తక్కువ స్థాయిలో ఉన్నారని సీబీఐ సూచిస్తోంది. వ్యవసాయ కూలీలు, దస్తూరీ పనులు, అస్థిర ఉద్యోగాలు, అప్పుల బరువు, విద్యలో ప్రవేశాల పరిమితి, గుడిసెల ప్రజానీకంగా ఉండడం వారిని పేదరిక చక్రంలో పట్టుకుని పెట్టాయి. ఈ కులాలకు చెందిన భూములు, ఆస్తులు చాలా తక్కువగా ఉండడం వారి స్థితిని మరింత గంభీరంగా మార్చింది. షెడ్యూల్డ్ ట్రైబ్స్(ఎస్టీ) 99 శాతం మంది రాష్ట్ర సగటు కంటే తక్కువ స్థాయిలో ఉన్నారు. అటవీ?పర్వత ప్రాంతాల్లో నివాసం, ప్రపంచానికి దూరం, ఆధునిక వనరులు?ఉద్యోగాలు అందకపోవడం వారి స్థితిని మరింత గంభీరంగా చేస్తున్నది. వారికి దగ్గరలో ఉన్న వనరులు కూడా సరైన విధంగా ప్రయోజనం చేకూరడం లేదు. ఇక బ్యాక్‌వర్డ్ క్లాసెస్(బీసీలు) 71 శాతం రాష్ట్ర సగటు కంటే తక్కువ స్థాయిలో ఉన్నారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56% మందిగా ఉండడం వల్ల వీరు కూడా "సింహభాగం" కన్నా ఎక్కువ వెనుకబడి ఉన్నారు.హైదరాబాద్ చూస్తే ఎత్తయిన భవనాలు కనిపిస్తాయి. అంటే సంపద కొందరి చేతుల్లోనే ఉంది. తెలంగాణలో ఆర్థికంగా బాగున్న కులాలు రెడ్డి, కరణం, బ్రాహ్మణులు, కోమటి, పట్నాయక్‌లు, వర్మ, ఓసీ క్రిస్టియన్లు, అయ్యంగార్లు, కమ్మ, అయ్యంగులు, వెలమ, రాజు, కాపులు తదతరులు ఉన్నారు. బీసీలలో తెలంగాణలో 56 శాతం ఉన్నారు. ఎస్సీలు 15 శాతం, ఎస్టీలు 10 శాతం, ఓసీలు 15 శాతం ఉన్నారు. కానీ 67 శాతం ప్రజలు సగటు జీవన ప్రమాణం కన్నా తక్కువ స్థాయిలో బతుకుతున్నారు.

# గులాబీ గూటికి ప్రీతిరెడ్డి...

హైదరాబాద్, ఏప్రిల్ 21,



తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ అనూహ్య మలుపులకు వేదికవుతూనే ఉంటాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కావడం అటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ.. ఇటు దేశ రాజధాని ఢిల్లీలోనూ పెను చర్చకు దారితీసింది. మల్లారెడ్డి వంటి సీనియర్ నేత.. అదీ రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యే, నేరుగా ప్రధానిని కలవడం వెనుక ఉన్న రాజకీయ గూఢార్థాలు ఇప్పుడు విశ్లేషణలకు పని పెడుతున్నాయి వారసత్వ రాజకీయాల కొత్త అడుగు ఈ భేటీలో అందరినీ ఆకర్షించిన ప్రధానాంశం మల్లారెడ్డి తన కోడలు ప్రీతిరెడ్డిని వెంట తీసుకెళ్లడం.. సాధారణంగా రాజకీయ నాయకులు తమ వారసులను జాతీయ స్థాయి నేతలకు పరిచయం చేస్తున్నారంటే.. అది భవిష్యత్తు ప్రాతినిధ్యానికి పునాది అని అర్థం. గత కొంతకాలంగా ప్రీతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షిస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనే తన కోరికను ఆమె గతంలోనే బహిరంగ పరిచారు. ఇప్పుడు ప్రధాని మోదీతో భేటీ ద్వారా.. ఆమెను బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపే దిశగా మల్లారెడ్డి పావులు కదుపుతున్నట్లు స్పష్టమవుతోంది. తెలంగాణలో అధికార మార్పిడి జరిగిన తర్వాత బీఆర్ఎస్ లో ఒక విధమైన సందిగ్ధత నెలకొంది. పార్టీలోని కీలక నేతలు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. మల్లారెడ్డికి మేడ్చల్, మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో బలమైన ఆర్థిక, సామాజిక పట్టు ఉంది. ఆయన వంటి నేత పార్టీని వీడితే అది గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది. అయితే బీఆర్ఎస్ శ్రేణులు దీనిని "మర్యాదపూర్వక భేటీ"గా అభివర్ణిస్తున్నప్పటికీ రాజకీయాల్లో 'అకస్మాత్తు మర్యాదలు' ఉండవనేది జగమెరిగిన సత్యం. మరోవైపు తెలంగాణలో పాగా వేయాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి మల్లారెడ్డి వంటి 'మాస్' ఇమేజ్ ఉన్న నేతలు అవసరం. ఆర్థిక వనరులు, విద్యాసంస్థల నెట్‌వర్క్ ఉన్న మల్లారెడ్డి కుటుంబం బీజేపీలోకి వస్తే, అది పార్టీకి అదనపు బలాన్ని ఇస్తుంది. బండి సంజయ్‌తో ప్రీతిరెడ్డి గతంలో జరిపిన భేటీని, ఇప్పటి మోదీ భేటీని కలిపి చూస్తే.. మల్లారెడ్డి కుటుంబం కమల తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఖరారైనట్లే కనిపిస్తోంది. . కేవలం ప్రయోజనాలు మాత్రమే ఉంటాయన్న నానుడి మల్లారెడ్డి విషయంలో మరోసారి రుజువయ్యేలా ఉంది. ఒకవేళ మల్లారెడ్డి బీజేపీ గూటికి చేరితే, అది తెలంగాణలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తుంది. తన రాజకీయ వారసురాలిగా కోడలు ప్రీతిరెడ్డిని ఢిల్లీ పీఠం వైపు నడిపించేందుకు మల్లారెడ్డి వేసిన ఈ 'మాస్టర్ ప్లాన్' ఎంతవరకు పారుతుందో కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా ఈ భేటీ బీఆర్ఎస్ శిబిరంలో ఆందోళనను, బీజేపీ వర్గాల్లో ఉత్సాహాన్ని నింపిందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో వెలువడే అధికారిక ప్రకటనలు తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని ప్రకంపనలు సృష్టించవచ్చు.

====================

# ప్రైవేట్ వీడియోలతో బాలికలు, యువతుల్ని బ్లాక్ మెయిల్

హైదరాబాద్, ఏప్రిల్ 21,

సోషల్ మీడియా వేదికగా చేసుకుని బాలికలు, యువతులను మోసం చేస్తున్న కోడూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్ ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఖరీదైన కార్లు, పబ్‌లలో దిగిన ఫొటోలను చూపిస్తూ తాను రిచ్ ఫ్యామిలీకి చెందినవాడినని నమ్మించి చాటింగ్ ద్వారా అమ్మాయిలకు దగ్గరయ్యేవాడు. తరువాత ప్రేమ పేరుతో లోబరుచుకుని వారితో ఏకాంతంగా గడిపిన వీడియోలు, ఫొటోలతో బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నట్లు గుర్తించారు. గడిచిన రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 20 మందికి పైగా యువతులను అర్జున్ మోసం చేసినట్లు తెలుస్తోంది. బాధిత యువతుల ఫిర్యాదుతో నిందితుడిపై మరో 3 కేసులు నమోదు చేశారు. మరో కేసును నార్సింగి పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై వినోద్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చామల్లమూడికి చెందిన ఆజాద్ అలియాస్ అర్జున్ ప్రస్తుతం మియాపూర్‌లో ఉంటున్నాడు. ధనవంతుల ఇళ్లల్లో పనిచేసే డ్రైవర్స్, వాచ్‌మెన్, ఇతర సిబ్బందితో పరిచయం పెంచుకుని వారికి కొంత నగదు ఇస్తూ ఆ ఇంట్లోని బాలికలు, యువతుల్ని ట్రాప్ చేసేవాడు. నిందితుడు అర్జున్ కేవలం సోషల్ మీడియా చాటింగ్‌కే పరిమితం కాలేదు. బాలికలు, యువతులతో ఏకాంతంగా ఉన్న గడిపిన సమయంలో రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసేవాడు. తనతో శారీరక సంబంధం పెట్టుకున్న వారికి ఆ ప్రైవేట్ వీడియోలు చూపించి బాధితులను బ్లాక్ మెయిల్ చేసేవాడు. వారి వద్ద నుంచి వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసేవాడు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఒక 15 ఏళ్ల బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. తరువాత మాయమాటలతో బాలికను లోబరుచుకున్నాడు. రాత్రివేళ ఎవరూ లేని సమయంలో ఇంటికెళ్లి బాలికను కలిసేవాడు. ఇది గమనించిన బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోక్సో కేసులో జైలుకు వెళ్లినా, బయటకు వచ్చాక మళ్లీ ఆ బాలికను వేధించాడు. వారి డ్రైవర్ కృష్ణ, అతడి భార్య సరస్వతి సెల్‌ఫోన్లలో ఆ బాలిక నిందితుడు అర్జున్‌తో తరచుగా మాట్లాడేది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెతో నిందితుడు ఏకాంతంగా గడిపేవాడు. ఈ విషయం ఇంట్లోవాళ్లకు చెబుతానంటూ డ్రైవర్ భార్య బాలికను బెదిరించింది. మరోవైపు అర్జున్ కూడా బెదిరించడంతో ఇంట్లో దాచిపెట్టిన రూ.29 లక్షల నగదును చోరీ చేసిన బాలిక తనను బ్లాక్ మెయిల్ చేస్తున్న అర్జున్‌కు రూ.13 లక్షలు ఇవ్వగా, డ్రైవర్ భార్య సరస్వతికి 10 లక్షలు ఇచ్చినట్టు ఫిర్యాదు చేశారు. నార్సింగికి చెందిన మరో యువతిని కూడా నిందితుడు మోసం చేశాడు. గుంటూరులో కాలేజీలో చేరేందుకు వెళ్లిన ఆమెను హోటల్‌కు తీసుకెళ్లి శారీరకంగా కలిశాడు. తరువాత పలుమార్లు ఇద్దరూ పబ్‌లు, హోటళ్లకు వెళ్లారు. ఆ తరువాత ప్రైవేట్ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించి ఆమె నుంచి గోల్డ్ చైన్ కాజేశాడు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో ఓ కంట కనిపెట్టాలని, వారి చర్యలు కొంచెం భిన్నంగా, అనుమానంగా కనిపిస్తే విషయాలు ఆరాతీయాలని లేకపోతే దారుణాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు.

====================

## 23న క్యాబినెట్ సమావేశం:

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభంపై చర్చ

హైదరాబాద్ ౯, ఏప్రిల్ 21,

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 23న జరగనుంది. సచివాలయంలోని ఆరో అంతస్తులో గల క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. సమావేశానికి అవసరమైన సమాచారంతో అందుబాటులో ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో



అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 99 రోజుల 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం కొనసాగుతోంది. జూన్ 12న ముగియనున్న ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలు నిర్ణయాలను ప్రకటించనుంది.క్యాబినెట్ భేటీలో చర్చించనున్న అంశాలు:జూన్ 2న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈసారి బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది. దీనికి రూ.4 వేల కోట్లను కూడా కేటాయించింది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ పథకం ప్రారంభ సాధ్యాసాధ్యాలను క్యాబినెట్‌లో పరిశీలించనున్నారు.మే నెలలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను ఖరారు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నాయి.గవర్నర్ కోటా కింద ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన కోదండరాం, అజారుద్దీన్‌లపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి..గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసి ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు.ఈ అంశం చర్చకు రావొచ్చు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న అంశం కూడా క్యాబినెట్‌లో చర్చకు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేటి నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ, డీఏలను ప్రకటించడం వంటి అంశాలను జేఏసీ లేవనెత్తుతోంది. ఈ సమస్యలపై క్యాబినెట్ చర్చించవచ్చని సమాచారం.ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తోంది. అయినా,రిటైర్ అయిన ఉద్యోగులకు పూర్తి స్థాయి ప్రయోజనాలు అందడం లేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సమావేశంలో చర్చ జరుగుతుందని సంఘాల నేతలు చెబుతున్నారు.యాసంగి ధాన్యం సేకరణపై క్యాబినెట్ దృష్టి సారించనుంది. ధాన్యం, మొక్కజొన్నల సేకరణ ఎంత జరిగింది, ఇంకా రైతుల వద్ద ఎంత మేర ఉందన్న వివరాలను క్యాబినెట్ ఆరా తీయనుంది.వడగళ్ల వానతో జరిగిన పంట నష్టాలపై క్యాబినెట్ చర్చించనుంది. నిజామాబాద్ వంటి జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి చేతికొచ్చిన వరి ధాన్యాన్ని రైతులు నష్టపోయారు. కళ్లాలు, రహదారులపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కుల సర్వే వివరాలను ప్రభుత్వం బయటపెట్టింది. కులాలవారీగా జనాభా, ఆయా కులాల చేతుల్లో ఉన్న భూమి, పేదరికం వంటి వివరాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌పై క్యాబినెట్ చర్చించనుంది.మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవడం, నిధుల చెల్లింపు అంశంతోపాటు కొత్తగా తీసుకురానున్న రోహిత్ వేముల వివక్ష నిరోధక చట్టంపై చర్చించే అవకాశాలున్నాయి.

# సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు ఏప్రిల్ 21,

బద్వేల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మొత్తం రూ.1 కోటి 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ క్రమంలో బద్వేల్ మున్సిపాలిటీలోని విద్యానగర్ కాలనీలో మంగళవారం రూ.20 లక్షల వ్యయంతో 210 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులు నాణ్యతతో పూర్తవ్వాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించడంతో ప్రజలకు ఆశించిన ఫలితాలు రాలేదని విమర్శించారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ పనులన్నీ త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని సూర్యనారాయణ రెడ్డి గారు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ జానపద కళాకారుడు ఏర్పుల వినేష్ ను అభినందించిన జిల్లా ఎస్పి పారితోష్ పంకజ్

సంగారెడ్డి, ఏప్రిల్21 (భారత శక్తి న్యూస్):

సంగారెడ్డి జిల్లా జిన్నారం గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు సాంస్కృతిక కళాశారది ఏర్పుల వినేష్ తన బృందం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పోలీస్ శాఖ, వారం రోజుల పాటు నిర్వహించిన"అరైవ్ - అలైవ్" ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రత,వాహన దారులు అవలంబిస్తున్న నిర్లక్ష్యం పై పాటలు పాడి విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా జిల్లా ఎస్పి కార్యాలయంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు,జహీరాబాద్ మండలం రాయిపల్లి'డి' గ్రామానికి చెందిన అయిదాల సునీల్ ని సంగారెడ్డి జిల్లా ఎస్పి పారితోష్ పంకజ్ ప్రశంసా పత్రం మెమెంటో ఇచ్చి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో యువత కు సందేశం,డ్రగ్స్ నిర్మూలన, బెట్టింగ్ యాప్ ల వాడకం, యువత ఆత్మ హత్యలకు సంబంధించి అయిదాల సునీల్ రచించిన పాటలు పాడి వినిపించగా జిల్లా ఎస్పి పారితోష్ పంకజ్ అభినందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక సారథి ఏర్పుల వినేష్ మాట్లాడుతూ చిన్ననాటి నుండి అనేక సామాజిక సాంస్కృతిక గ్రామీణ జానపద కలలను సమాజానికి పరిచయం కోసం జానపద కళాకారుడిగా అనేక పాటలను ఆలపిస్తూ ప్రజల



మన్ననలు పొంది ప్రభుత్వం ద్వారా గుర్తింపు సాధించి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక కళా సారథి ద్వారా సంగారెడ్డి జిల్లా సాంస్కృతిక కళాశాలదిగా బాధ్యతలు స్వీకరించి ప్రభుత్వం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో జానపద కళల్ని ప్రజలకు పరిచయం చేయడంలో స్ఫూర్తిగా నిలుస్తున్న మాకు జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ నన్ను అభినందించడం ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తం చేయడం జరిగింది, కార్యక్రమాలను కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులతో పాటు సిఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, చీఫ్ ఎలెక్టోరల్ కార్యాలయ అధికారులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(భారత శక్తి) కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని మంగళవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, చీఫ్ ఎలెక్టోరల్ కార్యాలయ ఈవీఎం రాష్ట్ర నోడల్ అధికారి బి. హరిసింగ్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.



ఈవీఎం గోదాం తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, బిజెపి, టీడీపీ, ఆమ్ ఆద్మీ, ఎంఐఎం పార్టీల ప్రతినిధులు కోరిపల్లి శ్రవణ్ రెడ్డి, సిరికొండ రమేష్, హైదర్, మజార్, ముజాయిద్ అలీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ, జేఈఈ మెయిన్స్ లో అల్ఫోర్స్ కు ర్యాంకుల పంట...అభినందించిన చైర్మన్ వి ఎన్ ఆర్



కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 21(భారత శక్తి):

వెలువడిన ఐ ఐటి, జే ఈ ఈ మెయిన్స్ 2026 ఫలితాలలో అల్ఫోర్స్ కు ర్యాంకులతో విద్యార్థులు విజయదుందుబి మోగించారు. వివిధ క్యాటగిరీలలో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ చైర్మన్ వి. నరేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. నగరంలోని అల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు పూల బొకెలతో ఆయన సన్మానించారు. వివిధ కేటగిరి లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. ఎం.శ్రీపార్టీష్ 29 వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, సి.హెచ్. లక్ష్మీహాసిని 116 వ ర్యాంకు, సి.హెచ్. పూర్ణచంద్ 138, ఎస్. వర్షినిరెడ్డి 211, ఎన్. రత్నప్రకాశ్ 239, పి. అక్షయ 250, ఎ. కీర్తన 274, యు. సిద్దీశ్వర్ 459, కె. ధనుష్ 556, కె.నచికేత్ 593, బి. లిఖిత్సాయి 737, యమ్. వశిష్ట 884, కె. ప్రజ్ఞాన్ 991, రెడ్డి శ్రీకర్ 1000 వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేశారని అన్నారు . 1000 లోపు 14 ర్యాంకులు, 2000 లోపు 18 ర్యాంకులు, 5000 లోపు 35 ర్యాంకులు సాధించగా, 450 మంది విద్యార్థులు ఐ ఐ టి పరీక్షకు అర్హత సాధించడం విశేషం. రాబోయే పరీక్ష వ్రాయుటకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందముచే కోచింగ్ ఇవ్వబడుతుందని తెలిపారు. పటిష్ట ప్రణాలికతో విద్యా భోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల అహర్నిషల కృషివల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగిందని ఈ సంధర్భముగా తెలియజేస్తున్నాని అన్నారు.

రాబోయే ఐ ఐ టి పరీక్షలో కూడ మా అల్ఫోర్స్ విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించి ప్రతిష్టాత్మక లలో సీట్లు సాధిస్తారని నేను విశ్వసిస్తున్నానని ఆయన అన్నారు. ప్రతి సంవత్సరము ఐఐటి , నీట్ , జూ్రాజుజు పోటీ పరీక్షలలో అల్ఫోర్స్ విద్యార్థులు రాణిస్తున్నందుకు నాకెంతో ఆనందంగా ఉ ందన్నారు. ఐఐటి, జె ఈ ఈ (మెయిన్ ) - 2026 ఫలితాలలో జాతీయస్థాయి అత్యున్నత ర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ చిన్నారులను వారి తల్లిదండ్రులను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు.



ఇంతటి ఘన విజయమునకు తోడ్పడిన మా అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని తెలిపారు.

# జేఈఈ మెయిన్స్ లో జయ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 21:

జేఈఈ మెయిన్స్ లో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సూర్యాపేట నుండి 5 విద్యార్థులు 99 పైన పర్సంటేజ్ 26 గురు విద్యార్థులు 90 ఆపైన 74 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్. సాయి రిత్విక్ 99.55, జి శ్రీనిక 99.43, ఎస్ ఆశువర్ధన్ 99.36, ఎం రితిన్ శెట్టి 99.23, సిహెచ్ శివకుమార్ 99.09, ఎస్కే నేహా 98.68, డి సిరి 97.16, ఎండి హాదియా 96.96, జీ వంశీ 96.09, జి హర్షిత 95.92, వి గౌతమ్ కుమార్ 95.71 పర్సంటేజ్ సాధించారని తెలిపారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరీ లలో 115, 563, 862, 963 లతో పాటు 5000 లోపు 10 ర్యాంకులు, 10000 లోపు 18 ర్యాంకులు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కృషిచేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి లు అభినందించారు.



# కమలాపూర్ పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం

జగిత్యాల ఏప్రిల్ 21 ( భారత శక్తి ప్రతినిధి ):

ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో మంగళవారం రోజున వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలతో పాటు ఉపాధ్యాయుల తో తమ గత



స్మృతులను మననం చేసుకున్నారుఈ సందర్భంగా కార్యక్రమ ముఖ్య అతిథి మండల విద్యాధికారి సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతోపాటు నైతిక విలువ నేర్పుతూ విద్యార్థి యొక్క ఉన్నత భవిష్యత్తును నిర్మితమయ్యేలా చేస్తుందని అలాంటి పాఠశాలలో గ్రామంలోని ప్రతి ఒక్క విద్యార్థిని చేర్పించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కమలాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి మాట్లాడుతూ గతంలో 26 ఉన్న విద్యార్థుల సంఖ్యను 62 కు పెంచిన గ్రామస్థులను,ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందాన్ని అభినందిస్తూ వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత పెంపుకు గ్రామ పంచాయతీ పాలకవర్గంను, గ్రామస్థులను, యువత ను భాగస్వాములను చేస్తూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నాగారం గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్ మాట్లాడుతూ నేను ఇదే పాఠశాలలో చదివి నేడు ప్రత్యేక అతిథి గా ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషం అని తెలుపుతూ ప్రజా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అందులో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుండి అల్పాహారంతో పాటు 21 వస్తువుల స్పెషల్ కిట్ ను అందిస్తుందని కావున తల్లిదండ్రులు డబ్బులు వృధా చేసుకోకుండా ప్రతి ఒక్కరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

పాఠశాల సముదాయ ప్రధాన ఉపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్ మాట్లాడుతూ కమలాపూర్ పాఠశాల విద్యార్థులు ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయిలో నిలిచి ఉపాధ్యాయ బృందానికి మంచి పేరు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎదుల మహేష్, ఉపాధ్యాయ బృందం మ్యాన పవన్ కుమార్, ప్రీతి, సునీత ,వెంకటేష్,రాజేష్, సూర్యతేజ, శ్రీలత మరియు వార్డ్ సభ్యులు ఒడ్డేటి జయలక్ష్మి , ఒడ్డేటి మంజుల,మిల్కురి సుజాత,

రాజురి శ్రీనివాస్ గౌడ్, మరియు ఆలయ కమిటీ చైర్మన్ కొండపల్లి సుధాకర్ రావు , వెంకటమ్మ, సంపూర్ణ,సంజన రేణుక తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు



జగిత్యాల, ఏప్రిల్ 21( భారత శక్తి ప్రతినిధి ):

మంగళవారం రోజున శ్రీ జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అనుభంద దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల శ్రీ ఆదిశంకరాచార్యుల వారికి మరియు శారదాదేవికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తరం పూజ , మన్యసూక్తం , దుర్గా సూక్తం , పంచోపనిషత్ లతో అభిషేకం , హారతి మంత్రపుష్పం కార్యక్రమములు అత్యంత వైభవంగా నిర్వహించబడినవి.

ఇట్టి కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్ , మాజి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, స్థానిక వేద పండితులు కాసర్ల వంశీకృష్ణ, కషోర్ఘుల చంద్రశేఖర శర్మ , నారంభట్ల ప్రశాంత్ శర్మ , సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ , అర్చకులు ద్యావల్ల విశ్వనాథ శర్మ , నంబి అరుణ్ కుమార్, సాయికుమార్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# కోటేశ్వర స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి: మంత్రి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల,ఏప్రిల్ 21 (భారత శక్తి ప్రతినిధి ):



కోటిలింగాలలో శ్రీ కోటేశ్వర స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కోటిలింగాలలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కళ్యాణానికి సోమవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ కు ఆలయ పూజారులు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటిలింగాలలోని కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి వివరించారు. 2027లో నిర్వహించి గోదావరి పుష్కరాలకు పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ట్రాక్ నుంచి పార్లమెంట్ వరకు భారత భవిష్యత్తుకు మహిళా నాయకత్వమే కీలకం :పి టి ఉష



విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 21:

నేను నా జీవితమంతా పరుగులోనే గడిపాను. మొదట కేరళలోని మట్టి ట్రాక్లపై, ఆ తర్వాత ప్రపంచ వేదికపై, ఇప్పుడు ప్రజా జీవితంలో ప్రతి అడుగులోనూ కొన్ని స్పష్టమైన, మరికొన్ని చెప్పలేనటువంటి అడ్డంకులను ఎదుర్కొన్నాను. అవి మహిళలకు ఇక్కడ చోటు లేదని చెబుతుండేవి. ఆ అడ్డంకులు తొలగిపోతుంటే ఏమవుతుందో కూడా ప్రత్యక్షంగా చూశాను. అవకాశం ఫలితాలనునిస్తూ, మరీ ముఖ్యంగా, నమ్మకాన్ని మారుస్తుంది.

అందుకే రాజ్యాంగ (128 సవరణ) బిల్లు, 2023---నారీ శక్తి వందన్ అధినియం---కేవలం ఒక శాసనపరమైన మైలురాయి మాత్రమే కాదు. ఇది సుదీర్ఘ కాలం పాటు అమలులోకి రాని ఒక నిర్మాణాత్మక సవరణ. లోక్సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు మూడో వంతు సీట్లను కేటాయించడమంటే కేవలం రాయితీనో, నామమాత్రపు చర్యనో కాదు. మరింత ప్రాతినిధ్యం, సమర్థవంతమైన ప్రజాస్వామ్యం వైపు అవసరమైన అడుగు.

ఇప్పటికే క్రీడలు మనకేం చూపించాయి

నేను 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్లో పోటీపడి, సెకనులో అతి తక్కువ తేడాతో పతకాన్ని కోల్పోయినప్పుడు, ప్రపంచ వేదికపై తమను తాము చూసుకోగలిగే భారతీయ అమ్మాయిలు చాలా తక్కువ మంది ఉండేవారు. దశాబ్దాలు గడిచేకొద్దీ ఆ పరిస్థితి మారింది. శిక్షణ, మౌలిక సదుపాయాలు, గుర్తింపు పొందే అవకాశాలు మెరుగుపడటంతో, దేశ మహిళలు అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతను సంపాదించుకున్నారు.

పి.వి. సింధు, మీరాబాయి చాను, వినేష్ ఫోగట్, మేరీ కోమ్ వంటి క్రీడాకారిణులు తోడ్పాటు లేకుండా అకస్మాత్తుగా రాణించలేదు. వారంతా వ్యవస్థ సాధించిన ఫలితం; ఆ వ్యవస్థ క్రమక్రమంగా అవకాశాలను విస్తరింపజేసింది. ప్రాతినిధ్యం ఆశయాన్ని సృష్టిస్తుంది---ఆ ఆశయానికి తగిన తోడ్పాటు లభించినప్పుడు అది విజయాన్ని సాధిస్తుంది.

మహిళలకు అవకాశం కల్పిస్తే, వారు కేవలం పాల్గొనడమే కాదు---అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తారని, ఇది మనకు స్పష్టంగా తెలియజేస్తుంది.

ప్రతి భారతీయుడికి మెరుగైన పాలన

ఇప్పటికే క్షేత్ర స్థాయిలో మహిళా నాయకత్వ ప్రభావాన్ని భారత్ చూసింది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టినప్పటి నుంచి, మహిళా ప్రతినిధుల నాయకత్వంలో తాగునీరు, పారిశుధ్యం, విద్య, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వంటి సౌకర్యాలు మెరుగుపడినట్లు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

ఇవి కేవలం 'మహిళా సమస్యలు' మాత్రమే కావు; ఇవి జాతీయ ప్రాధాన్యతలు. సురక్షితమైన బహిరంగ ప్రదేశాలు, క్రమశిక్షణతో సాగుతున్న పాఠశాలలు, పోషకాహారం, ఆరోగ్య సేవలు వంటివి కుటుంబాలను, సమాజాలను నేరుగా ప్రభావితం చేసే నిత్య పాలనా సవాళ్ల పై మహిళా నాయకులు దృష్టి సారిస్తున్నారు. ఈ ప్రాతినిధ్యాన్ని రాష్ట్ర శాసనసభలకు, పార్లమెంటుకు విస్తరింపజేయడం కేవలం న్యాయానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, పాలనపరమైన నాణ్యతను మెరుగుపరచే విషయం.

ప్రాతినిధ్యం వెనుక ఉన్న ఆర్థిక కారణందేశంలో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం దాదాపు 25 శాతం వద్దే నిలిచిపోయింది. ఇది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ. ఇంకా, ఇది కేవలం సామాజిక ఆందోళన మాత్రమే కాదు---ఒక ఆర్థికపరమైన పరిమితి కూడా. చట్టసభలలో మహిళలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించడం వల్ల, వారిలో దాగివున్న సామర్థ్యం ప్రాధాన్యత విధానాలకు తోడ్పాటును అందివ్వొచ్చు: తక్కువ ఖర్చుతో కూడిన శిశు సంరక్షణ, సురక్షితమైన పని ప్రదేశాలు, రుణ సదుపాయం, మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతు వంటివి ఇందులో ఉన్నాయి. లింగ సమానత్వాన్ని పెంపొందించడం ద్వారా భారతదేశ జీడిపి కి దాదాపు 700 బిలియన్ డాలర్లు అదనంగా చేరుతాయని మెకిన్సే గ్లోబల్ ఇన్స్టిట్యూట్ అంచనా వేసింది. మరింత సమగ్రమైన పార్లమెంటు అనేది కేవలం ప్రజాస్వామ్య అవసరం మాత్రమే కాదు; అది ఒక ఆర్థిక అనివార్యత కూడా. భద్రత, గౌరవం మరియు భాగస్వామ్యందేశ వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు, ప్రజా జీవితంలో భాగస్వామ్యం అనేది ఇప్పటికీ భద్రత, వివక్ష, సమాన అవకాశాలు లేకపోవడం వంటి ఆందోళనలతో ముడిపడి ఉంది. క్రీడలు, విద్య లేదా పని ప్రదేశం---ఏదైనా కావచ్చు, ఈ అడ్డంకులు ఇంకా లోతుగా పాతుకుపోయి ఉన్నాయి. పార్లమెంటులో ఎక్కువ మంది మహిళలు ఉండటం అంటే, చట్టాలు, విధానాలు కేవలం బయటి అవగాహనతో కాకుండా, నిజ వాస్తవాల ఆధారంగా రూపొందుతాయని అర్థం. దీనివల్ల చట్టాల అమలు కోసం బలమైన వాదనలు వినిపించడం, సహాయక వ్యవస్థల కోసం వనరుల మెరుగైన కేటాయింపు, స్పందనాయుతమైన, సులభంగా అందుబాటులో ఉండే న్యాయ చట్రం ఏర్పడతాయి. పాలన అనేది ఎవరి కోసం ఉద్దేశించబడిందో, వారి అనుభవాలను ప్రతిబింబించినప్పుడే అది మరింత సమర్థవంతంగా మారుతుంది. ప్రాతినిధ్యం, ఆశయ శక్తి

భారత్ లో అధికారంమంటే సుదీర్ఘకాలం పాటు ప్రధానంగా పురుషులదే. ఈ అంశాన్ని మార్చడమనేది కేవలం ప్రతీకాత్మకమైనది మాత్రమే కాదు---విప్లవాత్మక మార్పు కూడా.

మణిపూర్, జార్ఖండ్, రాజస్థాన్ లేదా దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన యువతికైనా, తనలాగే కనిపించే, తనలాగే మాట్లాడే, తనలాంటి నేపథ్యం నుంచి వచ్చిన ఒక మహిళ దేశ చట్టాలను రూపొందించడం చూసినప్పుడు, ఆమెలో స్ఫూర్తి నిండడమే కాదు, తాను ఏమైనా సాధించగలననే నమ్మకాన్ని ఇస్తుంది. ఆశయం అనేది సామాజిక మార్పుకు చోదక శక్తి. చట్టసభలలో రిజర్వేషన్లు అనేవి ప్రమాణాలను తగ్గించవు; అవి అవకాశాల పరిధిని విస్తరిస్తాయి. భారతీయ మహిళలు ఇప్పటికే క్రీడా రంగాలు, సాయుధ దళాలు, విమానయానం, కార్పొరేట్ బోర్డు రూమ్లలో అడ్డంకులను అధిగమించారు. ఆ ప్రయాణంలో శాసనసభ ప్రాతినిధ్యం అనేది ఒక సహజమైన తదుపరి అడుగు. కార్యాచరణకు ఇదే సరైన సమయం

రాజ్యసభ సభ్యురాలిగా సేవలందించే గౌరవం పొందిన నేను, విభిన్న దృక్పథాలు.. చర్చలను, నిర్ణయ ప్రక్రియను ఎలా బలోపేతం చేస్తాయో ప్రత్యక్షంగా చూశాను. అయినప్పటికీ, నేడు లోక్సభలో మహిళల ప్రాతినిధ్యం కేవలం 15 శాతంగానే ఉంది---ఇది ప్రపంచ సగటు కంటే చాలా తక్కువ. నారీ శక్తి వందన్ అధినియం ఆమోదం పొందింది. ఇక మిగిలింది దానిని పూర్తిస్థాయిలో, చిత్తశుద్ధితో, ఆలస్యం లేకుండా అమలు చేయాలనే రాజకీయ సంకల్పమే.

దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు అత్యున్నత నిర్ణయాధికార వ్యవస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించకుండా, భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆశించలేదు. సగం ప్రతిభను పక్కన పెట్టి 'వికసిత్ భారత్'ను నిర్మించలేము, అలాగే కేవలం సగం గొంతులతోనే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లలేదు.

ముందున్న మార్గం స్పష్టంగా ఉంది. ఆ మార్గంలో నడవాలనే పట్టుదల మనకు ఉందా లేదా అనేదే ఇప్పుడున్న ప్రశ్న.

**రచయిత: డాక్టర్ పి.టి. ఉష**

**(రాజ్యసభ ఎంపీ; భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, కామన్వెల్త్ గేమ్స్ అసోసియేషన్, భారత అధ్యక్షురాలు.)**

## గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం: ప్రిన్సిపల్ పి.సుధాకృష్ణ

భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 21 (భారత శక్తి) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశానికి ఈనెల 6వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని హసన్ పర్తి గురుకుల కళాశాల ప్రిన్సిపల్ పి. సుధా కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు హాజరైన విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు సిఓఈ వృత్తి విద్యలు సైనిక కళాశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ,ఎంఈసి, సీఈసీ, హెచ్ఈసి మొదలైన గ్రూపులలో ప్రవేశం పొందవచ్చు అని తెలిపారు పూర్తి వివరాల కోసం సమీపంలోని గురుకుల కళాశాలలో సంప్రదించవచ్చని హసన్పర్తి ప్రిన్సిపల్ పి .సుధాకృష్ణ తెలిపారు.

## చోరీకి గురైన 100 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించిన జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21(భారత శక్తి)

నిర్మల్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ దొంగతనాలపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో భాగంగా, చోరీకి గురైన, పోగొట్టుకున్న 100 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ ఫోన్ల మొత్తం విలువ సుమారు రూ. 12 లక్షలు గా అంచనా వేయబడింది. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు, పోలీసులు జజు×= (జవత్తీఖ్రీ జునబఋజూఎవత్ ×నవత్ణ్రఎ =వస్త్ర-ఱర్వతీ) పోర్టల్ను సమర్థవంతంగా వినియోగించి ఈ రికవరీ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు ఫోన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన పౌరులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జజు×= పోర్టల్ ద్వారా వాటిని తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఫోన్ పోయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు, ఙఙ.ఎవఱతీ.స్త్రశీజ.ఱఅ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. అలాగే మొబైల్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పోగొట్టుకోవడం వ్యక్తిగత మరియు సామాజిక భద్రతకు ముప్పుగా మారవచ్చని హెచ్చరించారు. పోయిన ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇప్పటి వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 2135 మొబైల్ ఫోన్లు (సుమారు రూ. 2.56 కోట్లు విలువైనవి) రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠిన పర్యవేక్షణ అవసరమని పేర్కొంటూ, వినియోగదారులు ఫోన్ల మూలాలను నిర్ధారించుకుని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో మొబైల్స్ కలిగిన వ్యక్తులపై విచారణ జరపాలని పోలీసు అధికారులకు



ఆదేశాలు జారీ చేశారు. ప్రజల్లో జజు×= వినియోగంపై అవగాహన పెంచుతున్నామని, ఎవరికైనా సెల్ ఫోన్ దొరికితే సంబంధిత యజమానికి లేదా పోలీస్ స్టేషన్కు అప్పగించాలని కోరారు. మొబైల్ ఫోన్ల రికవరీలో సాంకేతిక నైపుణ్యం ప్రదర్శించిన ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా కు ఘన వీడ్కోలు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి, వనపర్తి జిల్లాకు బదిలీ.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 21(భారత శక్తి) భైంసా ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ మీనా అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది వనపర్తి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించింది.

ఈ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించగా, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల రాజేష్ మీనా కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సింహ తలాట చిహ్నాన్ని అలంకరించి, కొత్త బాధ్యతల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రాజేష్ మీనా కు శుభాకాంక్షలు తెలియజేశారు.




ఈ వీడ్కోలు సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

## ప్యాడీ కొనుగోలు కేంద్రాల పనితీరును పరిశీలించిన రాష్ట్ర సివిల్ సప్లై ప్రధాన కార్యదర్శి, కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపిఎస్

కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 21: మంగళవారం తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై ప్రధాన కార్యదర్శి, కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని ప్యాడీ ప్రొక్యూర్మెంట్ సెంటర్ (పీఏసిఎస్), గోకుల్ తాండా పీపీసీ (ఐకేపి)లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి, ప్యాడీ కొనుగోలు కేంద్రాల పనితీరును పరిశీలించారు. ప్యాడీ కొనుగోలులో భాగంగా పని చేస్తున్న అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే రైతులకు చెల్లింపులు త్వరగా జరగేందుకు ఓపీఎమ్ఎస్ టాబ్లెట్లలో నమోదులను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 35,300 మెట్రిక్ టన్నుల ప్యాడీ కొనుగోలు జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లై అధికారి (డిసిఎస్ఓ), డీఎం (సివిల్ సప్లైస్), డిఆర్డీఓ, డిసిఓ, డిఎల్ఎమ్ఓ, ఏడి (మార్కెటింగ్), ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ రాపాక విజయరాజుకు ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 21:

రాపాక విజయరాజును ప్రతిష్టాత్మక 'దళిత రత్న' అవార్డు వరించింది. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్లోని అంబేద్కర్ కళాభవన్లో ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఉత్సవాల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాపాక విజయరాజు ఈ అవార్డును అందుకున్నారు. ఉత్సవాల కమిటీ కో-చైర్మన్ సుదర్శన్ బాబు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని పొందారు. ఈ సందర్భంగా రాపాక విజయరాజు మాట్లాడుతూ, దళిత రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, సామాజిక సాధికారత కోసం నా వంతు కృషిని మరింత ముమ్మరం చేస్తాను అని పేర్కొన్నారు. ఈ గుర్తింపునకు సహకరించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు, ఉత్సవాల కమిటీ సభ్యులకు, దళిత జర్నలిస్టుల ఫోరం కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దుమ్మాటి శివకుమార్, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి, పరంజ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగత్ ప్రకాష్, శ్రీను, కర్రోళ్ల అన్నమ్మ, సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షులు కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం సంయుక్త మీనన్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుండి దీనిపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఈ సినిమా గురించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఒక ప్రత్యేక గీతం కోసం 'గోల్డెన్ లెగ్' సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ సినిమాల్లో పాటలు, ముఖ్యంగా మాస్ సాంగ్స్ ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'పెద్ది' కోసం ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని సమాచారం. ఈ మాస్ నంబర్‌లో రామ్ చరణ్ సరసన సంయుక్త మీనన్ ఆడిపాడనుందనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. సంయుక్త తొలిసారిగా అఖండ 2 లో బాలయ్య సరసన జాజికాయ అనే స్పెషల్ సాంగ్ లో నటించి మెప్పించింది. ఇప్పుడు మరోసారి స్పెషల్ సాంగ్‌లో మెగా హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం విశేషం. అయితే ఈ స్పెషల్ సాంగ్ లో చరణ్ సరసన మానస వారణాసి, మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి భామల పేర్లు వినిపించాయి కానీ చివరికి సంయుక్తకు డైరెక్టర్ బుచ్చిబాబు గ్రీన్ సిగ్నల్ ఇసినట్టు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా 'పెద్ది' రూపొందుతోంది. ఇందులో రామ్ చరణ్ మునుపెన్నడూ లేని విధంగా ఒక కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇప్పుడు సంయుక్త మీనన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

# యూత్ మూవీకి రిషబ్ శెట్టి ఫిదా

ఇటీవల విడుదలై మంచి ఆదరణ సొంతం చేసుకుంటోంది 'యూత్' మూవీ. ఇప్పటికే దీనిపై ఎంతోమంది సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా.. తాజాగా రిషబ్‌శెట్టి కూడా దీనికి ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. చాలాకాలం తర్వాత, ఒక సినిమా చూస్తున్నంతసేపు నేను నవ్వుతూనే ఉన్నాను. 'యూత్' సినిమాలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. తల్లిదండ్రులకు ఇచ్చిన గొప్ప బహుమతి 'యూత్'. తెరపై నటీనటులంతా చాలా సహజంగా కనిపించారని రిషబ్ అన్నారు. దర్శకుడి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన రిషబ్ సినిమా రంగానికి కెన్ కరుణాస్ ఒక గొప్ప ఆస్తి అని పేర్కొన్నారు.



'యూత్' కథేంటంటే..: మధ్యతరగతి కుటుంబానికి చెందిన టీనేజర్ ప్రవీణ్ (కెన్ కరుణాస్). అతడి అల్లరి పనుల వల్ల స్కూల్‌లో ఏ అమ్మాయీ తనవైపు కన్నెత్తి కూడా చూడదు. కానీ, ప్రవీణ్ మాత్రం తన స్కూల్ లైఫ్ పూర్తయ్యేలోపు ప్రేమించాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గంగవల్లి (అనీషా అనిల్ కుమార్), ప్రేషిక (మీనాక్షి దినేష్), సోనాల్ (ప్రియాన్షీ యాదవ్) తన జీవితంలోకి వస్తారు. మరి ఆ ముగ్గురి వల్ల ప్రవీణ్ జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది? ప్రేమ, బ్రేకప్, అవమానాలు లాంటి అనుభవాలతో అతడు నేర్చుకున్న జీవిత పాఠమేంటి? ఈ ప్రయాణంలో తన తల్లిదండ్రులు ఉన్నికృష్ణన్ (సూరజ్ వెంజరమూడు), సరోజ (దేవదర్శిని) పాత్రలకి ఉన్న ప్రాధాన్యం ఏంటి? వారి కలల్ని హీరో నెరవేర్చాడా? అన్నది మిగిలిన కథ.

# బాబూ మోహన్‌కు రేలంగి అవార్డు

హాస్యనటచక్రవర్తి పద్మశ్రీ రేలంగి అవార్డును నటుడు డా.బాబుమోహన్ అందుకున్నారు. 41ఏండ్ల నటజీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు ఫిల్మ్ టెలివిజన్ వెల్ఫేర్ ఫార్మ్ అండ్ భారత్ కల్చరల్ అకాడమీ సంస్థ ఆయనకు ఈ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, నాగబాల సురేశ్,




నటుడు రాంకీ, 30ఇయర్స్ పృథ్వీరాజ్ తదితరులు అతిథులుగా పాల్గొని తెలుగు సినిమాకు బాబుమోహన్ చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు.

బాబుమోహన్ మాట్లాడుతూ 'రేలంగి అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఈ 41ఏండ్ల నట జీవితంలో నన్ను పోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను. అవార్డుల కంటే ప్రజల ఆశీస్సులే గొప్ప దీవెన. ఇక 'పద్మ' అవార్డు వస్తే సంతోషం. రాకపోయినా ఫర్వాలేదు' అని బాబుమోహన్ అన్నారు.



# హోంబలే నుంచి మహావతార్ పరశురామ్

కేజీఎఫ్, కాంతారా, సలార్, మహావతార్ నరసింహ.. ఇలా వరుస బ్లాక్‌బాస్టర్స్‌తో సినిమా స్థాయిని పెంచిన నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ నుంచి రాబోతున్న మరో యానిమేటెడ్ దృశ్యకావ్యం 'మహావతార్ పరశురామ్' రాబోతోంది. పరశురామ జయంతి సందర్భంగా 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్‌ని ప్రజెంట్ చేస్తూ ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని, గ్లింప్స్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గొడ్డలి చేతబట్టి నరమేధాన్ని సృష్టిస్తున్న పరశురాముడ్ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. పరశురాముడి ముఖాన్ని చూపించకుండా, ఆయన చేతిలో రక్తంతో తడిసిన పరశును(గొడ్డలి), రక్తంతో తడిచి ముద్దయిన యుద్ధభూమిని, దూరంగా భీతితో చూస్తున్న సైన్యాన్ని పోస్టర్‌లో చూపిస్తూ కథపై మరింత ఆసక్తిని పెంచారు మేకర్స్. మహావిష్ణు అవతారాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కథ మోడ్రన్ విజువల్ వండర్‌గా, గ్రేట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో అలరిస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సామ్ సిఎస్ ఈ చిత్రానికి సంగీత దర్శకుడు.



## హట్టహాసంగా ఎమ్మెల్యే
# చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు

సంగారెడ్డి, ఏప్రిల్ 21 (భారత శక్తి ప్రతినిధి): సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా,హట్టహాసంగా నిర్వహించారు.సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం వద్ద పండుగ వాతావరణాన్ని తలపించింది. పట్టణం అంతటా ఎమ్మెల్యే ఫ్లెక్సీలు, బ్యానర్లు అలంకరించగా, కార్యకర్తలు, అభిమానుల సందడి నెలకొంది. మండలాల వారీగా వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రేన్లతో గజమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఎమ్మెల్యే గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బిఆర్‌ఎస్ శ్రేణుల మధ్య భారీ కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణం 13వ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సేవా భావాన్ని చాటుకున్నారు. ప్రత్యక్షంగా మరియు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు

# ధ్యాన మందిరానికి భూమి పూజ

నిజామాబాద్,భారత శక్తి ప్రతినిధి,ఏప్రిల్ 21: బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో పిరమిడ్ ధ్యాన దంపతులు శ్రీమతి శ్రీ రెడ్డి మల్లయ్య దశవ్వ ఇంటి దగ్గర నూతన పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణం కొరకు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టడం జరిగింది. పి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి విచ్చేసి పిరమిడ్ ధ్యాన మందిరానికి భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి శాఖాహారాన్ని భుజించి పిరమిడ్ శక్తిని ఉపయోగించుకోవడం వల్ల అనేకమైన శారీరక మానసిక రుగ్మతల నుండి బయటపడి ఆరోగ్యంగా ఆనందంగా సంతోషంగా జీవించవచ్చని ఈ సందర్భంగా సాయి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో



పిరమిడ్ నిర్మాణకర్తలు రెడ్డి దశవ్వ మల్లయ్య, పి ఎస్ ఎస్ ఏం నిజామాబాద్ జిల్లా ముఖ్య సలహాదారులు విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి బొడ్డు దయానంద్, విశ్రాంత రైల్వే సూపరిడెంట్ సాయిబాబా, పి ఎస్ ఎస్ ఏం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ అమరవాజి శ్రీనివాస్, ఆర్మూర్ రాజు, అమీనాపూర్ మాజీ ఎంపీటీసీ గంగామణి, పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

# ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల ప్రక్రియ మే 1 నుంచి 31 వరకు కొనసాగుతుందని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. జూన్ 1 నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒకే చోట మూడేండ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీకి అర్హులు. అయితే నాలుగేండ్లు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులకు దీన్నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు బదిలీని కోరుకునే అవకాశం వారికే కల్పిస్తారు. జీవిత భాగస్వామి ఆధారంగా కోరుకునే బదిలీలకు మూడేండ్ల నిబంధన వర్తించదని జీవోలో స్పష్టం చేశారు. ఏ ఒక్క క్యాడర్‌లో కూడా 40శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగులను బదిలీ చేయకూడదు. బదిలీల ప్రక్రియ మొత్తం కౌన్సెలింగ్ పద్ధతిలో సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్/వెబ్ ఆధారిత అప్లికేషన్ ద్వారా పారదర్శకంగా జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే బదిలీల సమయం లో భార్యాభర్తలు (ఒకరికి మాత్రమే), ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారు, 70 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు, మానసిక వికలాం గులైన పిల్లలున్న తల్లిదండ్రులు, వితంతువులు, క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీమార్పిడి, లివర్ మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ వంటి వైద్య అవసరాలు కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తారు. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. సెన్సస్ (జనాభా గణన) సంబంధిత పనుల్లో ఉన్న ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తించబోవని స్పష్టం చేసింది. బదిలీల ప్రక్రియను పర్యవేక్షించడానికి క్యాడర్ వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. స్టేట్, మల్టీజోనల్/జోనల్, జిల్లా స్థాయిల్లో అధికారుల నేతత్వంలో ఈ కమిటీలు పని చేయనున్నాయి.

# జగద్గిరిగుట్ట కోనేరుకు 'హైడ్రా' జవజీవాలు



* ఆక్రమణల తొలగింపు.. 26 ట్రక్కుల వ్యర్థాల తరలింపు
* 22 ఏళ్ల నాటి పూజారి పోరాటం సఫలం


హైదరాబాద్, ఏప్రిల్ 21 (భారత శక్తి): జగద్గిరిగుట్టలోని చారిత్రక కోనేరుకు (గుండం) ఎట్టకేలకు విముక్తి లభించింది. దశాబ్దాలుగా ఆక్రమణల కోరల్లో చిక్కుకున్న ఈ కోనేరును హైడ్రా (HYDRAA) అధికారులు మంగళవారం పునరుద్ధరించారు. ఆలయ పూజారి నరహరి గతంలో కన్నీరు పెట్టుకుంటూ చేసిన ఆర్తనాదం, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియోపై స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఈ చర్యలు చేపట్టారు.

**26 ట్రక్కుల వ్యర్థాల తొలగింపు**

సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో ఉన్న ఈ కోనేరును స్థానిక కబ్జాదారులు మట్టితో నింపేసి, పార్కింగ్ స్థలంగా మార్చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన హైడ్రా సిబ్బంది, మంగళవారం భారీ యంత్రాలతో రంగంలోకి దిగారు. కోనేరులో పేరుకుపోయిన సుమారు 26 ట్రక్కుల, నిర్మాణ వ్యర్థాలు, చెత్తను పూర్తిగా తొలగించారు. ఆక్రమణలను తొలగించి కోనేరు అసలు స్వరూపాన్ని బయటకు తెచ్చారు.

**నెరవేరిన పూజారి కల:**

కోనేరు సంరక్షణ కోసం గత 22 ఏళ్లుగా పోరాడుతున్న గోవిందరాజుల స్వామి ఆలయ పూజారి నరహరి ఈ సందర్భంగా భావోద్వేగానికి గురయ్యారు. "నా జీవిత కాలంలో ఈ కోనేరును మళ్ళీ చూస్తానో లేదో అని భయపడ్డాను. భగవంతుడే హైడ్రా రూపంలో వచ్చి ఈ పుణ్యస్థలాన్ని కాపాడారు" అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కొండపై నుంచి వచ్చే వర్షపు నీరు కోనేరులోకి చేరేలా ఏర్పాట్లు చేస్తామని, అవసరమైతే బోర్ల ద్వారా నీటిని నింపి పూర్వవైభవం తెస్తామని ఆయన పేర్కొన్నారు.





**భక్తుల హర్షం**

జగద్గిరిగుట్టలో వెంకటేశ్వర స్వామి, హనుమాన్, గోవిందరాజుల స్వామి, వాసవి కన్యకాపరమేశ్వరి వంటి అనేక ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. ఇంతటి ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి, పర్యావరణాన్ని కాపాడిన హైడ్రా పనితీరుపై స్థానికులు మరియు భక్తులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



# బందారం టు దర్గా బీటీ రోడ్డుకు శంకుస్థాపన

* అభివృద్ధికి చిరునామా కాంగ్రెస్ పార్టీ
* డిసిసి అధ్యక్షురాలు

సిద్దిపేట , ఏప్రిల్ 21 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. మంగళవారం బందారం గ్రామం నుండి దర్గా వరకు దాదాపు 3 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ కొలుపుల గంగాధర్ ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పనులు ప్రారంభించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. బందారం టు దర్గా రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రయాణికుల ఇబ్బందులు తొలగుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ పొట్ట పరశురాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, తిమ్మారెడ్డి పల్లె సర్పంచ్ కొయ్యడ వెంకటేష్, దర్గా సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు. అలాగే నాయకులు సురేందర్రావు, కనక రాములు, మాజీ సర్పంచులు నిమ్మ దుర్గారెడ్డి, పాలడుగు చంద్రారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగుల వెంకటేష్, గంగుల రాజు, కొలుపుల కనకవ్వ, నీలా హైమావతి, సీనియర్ నాయకులు తోట మాధవరెడ్డి, గంగుల అనిల్, రామ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కామిరెడ్డి నరసింహారెడ్డి, పెద్ద అంకుల్ శ్రీకాంత్, మెరుగు రాజు, గంగుల మల్లేశం, రాగళ్ల రాజు, బట్ట యాదగిరి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### బీరంగూడ అభివృద్ధి చేయండి

# బీరంగూడ అధ్యక్షులు అదెల్లి రవీందర్

అమీన్‌పూర్ ఏప్రిల్ 21 భారత శక్తి బీరంగూడ డివిజన్ లో స్మశాన వాటిక తక్షణమే అభివృద్ధి చేయాలనీ శంబుణికుంట అభివృద్ధి చేయాలనీ శంబుణికుంట నాలా మరియు తూము టాక్షణమే నిర్మంచాలని గండీకుంఠ అభివృద్ధి చేయాలనీ బీరంగూడ కమిటీ అధ్యక్షులు అదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ కి కమిటీ సభ్యులు వినతి పత్రం సమర్పించారు.ఈసందర్భంగా అదెల్లి రవీందర్ మాట్లాడుతూ



1. బీరంగూడ స్మశాన వాటిక లో రోడ్లు నిర్మింవ్వాలని స్నానాలా గదులు నిర్మించాలని పూల చెట్లు పెంచాలని నీటి సౌకర్యం కల్పించాలని వినతి సమర్పించారు.
2. శంబుణికుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని మురికిన్నీరు శంబుని కుంట లో పడకుండా చూడాలని గుఱ్ఱెపుడెక్క తొలగించాలని షాంబునికుంటాను ఆహ్లాదంగా ఉండే విదంగా బోట్లు ఏర్పాటుచేసి అభివృద్ధి చేయాలనీ
3. శంబుని కుంట నాలా మరియు తూము తక్షణమే నిర్ణించి జయలక్ష్మి మరియు ఇతర కలనీలలో నీరు రాకుండా చూడాలని తక్షణమే పనులు ప్రారంభించాలని వినతి పత్రం సమర్పించారు.
4. గండీకుంఠ తక్షణమే అభివృద్ధి చేసి మల్లికార్జున హిల్స్ మరియు చుట్టూ కాలనిలా ప్రజలకు ఆహ్లాదంగా ఉండే విదంగా అభివృద్ధి చేయాలనీ పేర్కొన్నారు.

ఈకార్యక్రమంలో బీరంగూడ కమిటీ అధ్యక్షులు అదెల్లి రవీందర్ ఉపాధక్షులు పిర్జపతి సత్యనారాయణ నక్కల కిష్టయ్య ప్రధాన కార్యదర్శి గుట్టమీది వీరేషం కార్యదర్శి దండు జ్ఞానేశ్వర్ కోశాధికారి బంటు శివ కార్యవర్గ సభ్యులు కొతడి ప్రభాకర్ బంటు ప్రవీణ్ ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నంబర్ ప్లేట్ 'టాంపరింగ్' చేస్తే పక్కాగా బుక్కే!

* మల్కాజిగిరి ట్రాఫిక్ జోన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్
* ఒకే రోజు 462 కేసులు.. రూ. 82 వేల జరిమానా
* నిబంధనలు అతిక్రమిస్తే ఛార్జ్ షీట్లు తప్పవన్న పోలీసులు

మల్కాజిగిరి, ఏప్రిల్ 21 (భారతశక్తి): రోడ్లపై తిరిగే వాహనాలకు నంబర్ ప్లేట్లు సరిగ్గా లేకపోతే ఇకపై కఠిన చర్యలు తప్పవు. నంబర్ ప్లేట్ల నిబంధనల ఉల్లంఘనపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 462 వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు రూ. 82,400 జరిమానా విధించారు.

**జంక్షన్లలో జల్లెడ..**

ట్రాఫిక్ డీసీపీ I రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో తిరుమల గిరి, మల్కాజిగిరి డివిజన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఫ్యాన్సీ నంబర్లు, ప్లేట్లపై అక్షరాలు మార్చడం, అస్పష్టంగా ఉండటం వంటి వాటిపై ఫోకస్ పెట్టారు. తిరుమలగిరి, మల్కాజిగిరి ఏసీపీలతో పాటు ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

**66 మందిపై ఛార్జ్ షీట్లు**

కేవలం జరిమానాలతోనే సరిపెట్టకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తున్న వారిపై పోలీసులు సీరియస్ అయ్యారు. పదేపదే తప్పు చేస్తున్న వారు, అసలు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 66 మందిపై ఛార్జ్ షీట్లు దాఖలు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.

**వీటిపైనే నిఘా:**

ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ప్రధానంగా ఈ కింది అంశాలను తనిఖీ చేశాయి:
* వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు (*HSRP) ఉన్నాయా? లేదా?
* నంబర్ ప్లేట్ పై అక్షరాల సైజు, ఫాంట్, స్పేసింగ్ నిబంధనల ప్రకారం ఉందా?
* నంబర్లు స్పష్టంగా కనిపిస్తున్నాయా? లేదా మార్పులు (టాంపరింగ్) చేశారా?
* "అక్రమ నంబర్ ప్లేట్ల వల్ల నేరస్తులను గుర్తించడం పోలీసులకు సవాలుగా మారుతోంది. ఇది రోడ్డు భద్రతకు పెద్ద ముప్పు. ప్రతి వాహనదారుడు ఖచ్చితంగా HSRP ప్లేట్లనే వాడాలి. ఫ్యాన్సీ ప్లేట్లు ఉంటే వెంటనే తొలగించాలి, లేదంటే కఠిన చర్యలు తప్పవు."*

* **ట్రాఫిక్ విభాగం**

ట్రాఫిక్ నిబంధనల అమలుపై ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# మధుయాష్కి చొరవ: బృందావన్ మిడోస్‌కు రూ. 35 లక్షలు

* కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

ఎల్బీనగర్, ఏప్రిల్ 21 (భారతశక్తి) : ఏళ్ల తరబడి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న సాహెబ్‌నగర్ డివిజన్ బృందావన్ మిడోస్ కాలనీ వాసుల గోడును మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ ఆలకించారు. ఆయన ప్రత్యేక చొరవతో కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 35 లక్షల నిధులు మంజూరయ్యాయి.

* ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మధుయాష్కి



గత అక్టోబరులో కాలనీలో పర్యటించిన మధుయాష్కి, అక్కడి రోడ్ల దుస్థితిని స్వయంగా పరిశీలించారు. వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న దారుల వల్ల కాలనీ వాసులు పడుతున్న అవస్థలను చూసి ఆయన చలించిపోయారు. సమస్యను పరిష్కరిస్తానని అప్పట్లోనే హామీ ఇచ్చిన ఆయన, ఆ మేరకు మున్సిపల్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి నిధుల విడుదలకు కృషి చేశారు.

**త్వరలో మారనున్న కాలనీ రూపురేఖలు**

మధుయాష్కి కృషితో నిధులు మంజూరు కావడంతో కాలనీలో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను కూడా సీసీ రోడ్లుగా మార్చనున్నారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి, నిధులు మంజూరు చేయించిన *మధుయాష్కి గౌడ్*కు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# గజ్వేల్ లో ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు

గజ్వేల్, ఏప్రిల్ 21 (భారత శక్తి) : గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు మంగళవారం స్థానిక సీతారామ ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ, ఆదిశంకరాచార్య ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకం, పుష్పార్చన, మంగళహారతి మరియు మంత్రపుష్పం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు, అద్వైత సిద్ధాంత ప్రచారానికి ఆదిశంకరాచార్యులు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.



ఆయన చూపిన మార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు దేశపతి శంకర్ శర్మ, కార్యదర్శి రవీందర్రావు, కోశాధికారి కృష్ణమూర్తి శర్మ, చాడ నందబాలశర్మ, ఉపాధ్యక్షుడు రాయారావు విశ్వేశ్వర్ రావు పాల్గొన్నారు. వారితో పాటు బెజుగామ నాగేందర్రావు, దేవునూరి రాజేశ్వర్, యేగీశ్వర మురళిశర్మ, అమరవాది నీరంజన శర్మ, ఆదిరాజుపల్లె శ్రీనివాస్ శర్మ మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

* మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్య



సిద్దిపేట, ఏప్రిల్ 21 (భారత శక్తి) : రైతుల ప్రయోజనార్థం వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య అధికారులను ఆదేశించారు. దౌల్తాబాద్, రాయపోల్ మండలాల ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, సీఏలు, వ్యవసాయ అధికారులతో రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొనుగోళ్లు ఆలస్యం కాకుండా వెంటనే ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం తరలింపును వేగవంతం చేసి, కేంద్రాల్లో కవర్లు, తూకం యంత్రాలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అధికారులు మాట్లాడుతూ కొనుగోలు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని, తేమ శాతం ప్రమాణాల్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**అధికారుల నిర్లక్ష్య ధోరణి**

సమావేశం సమయంలో కొంతమంది అధికారులు సెల్‌ఫోన్లలో నిమగ్నమవడం, మరికొందరు నిద్రలోకి జారుకోవడం గమనార్హం. రైతుల సమస్యలపై జరిగే కీలక సమావేశాల్లో ఇలాంటి నిర్లక్ష్యం ఆందోళన కలిగిస్తోంది. సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారానికి సహకరించండి

* ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటే ప్రజా ఉద్యమం తప్పదు..
* బీహెచ్ఈఎల్ యాజమాన్యానికి విన్నవించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..



రామచంద్రాపురం ఏప్రిల్ 21 (భారత శక్తి): రామచంద్రపురం డివిజన్ పరిధిలో గల బిహెచ్ఇఎల్ భూములకు సంబంధించి నెలకొన్న వివాదాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని.. కాలయాపన చేస్తే ప్రజల నుండి వ్యతిరేకత ఎదురుకోవాల్సి వస్తుందని బిహెచ్ఈఎల్ యాజమాన్యానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం బిహెచ్ఇయల్ ఈడి శ్రీనివాస్, ఏజీఎం సురన్ ప్రసాద్ లతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఈఎస్ఐ చర్చి సమీపంలో గల బీరప్ప గుడిని బిహెచ్ఇయల్ పరిశ్రమ భూమిలో ఉందంటూ సంబంధిత అధికారులు తొలగించడం జరిగిందని తెలిపారు. ఇది మాత్రం సమంజసం కాదని.. పరిశ్రమ ఏర్పాటు చేయకముందు నుండి గుడి అక్కడే ఉందని తెలిపారు. వెంటనే అదే స్థలంలో గుడిని పునర్నిర్మాణం చేపట్టకపోతే ప్రజల నుండి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రామచంద్రపురం రాయసముద్రం చెరువు సుందరీకరణ అంశంలో ఎందుకు అడ్డుపడుతున్నారంటూ ప్రశ్నించారు. ప్రజోపయోగ అంశాలలో సహకరించాల్సింది పోయి అడ్డుకోవడం సమంజసం కాదని తెలిపారు. చెరువు సుందరీకరణ పనులకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డంకులు తెలపవద్దని విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ సమీపంలో గల క్రిస్టియన్ కమ్యూనిటీ స్మశాన వాటికలో కేవలం బీహెచ్ఈఎల్ ఉద్యోగులకు..వారి కుటుంబ సభ్యులకు మాత్రమే అంత్యక్రియలకు అనుమతిస్తున్నారని స్థానికులు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. స్థానికులకు సైతం అనుమతించాలని కోరారు. అదే విధంగా హిందూ స్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పనకు అభ్యంతరాలు తెలుపవద్దని కోరారు. ఈ అంశాలపై బుధవారం సాయంత్రం మరో మారు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్లు పుష్ప నగేష్, అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, రామచంద్రపురం పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడ ఫ్లైఓవర్ కట్టాలనే నిర్ణయం విరమించుకోవాలి

**: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



ఎల్బీనగర్, ఏప్రిల్ 21(భారత శక్తి): మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు...కానీ ప్రజలకు అపకారం, నష్టం, కలిగించే నిర్ణయాలకు మాత్రమే వ్యతిరేకం. అవసరం ఉన్న చోట ఫ్లైఓవర్ నిర్మించాలి కానీ అవసరం లేని చోట ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. మంగళవారం చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఓవైసీ హాస్పిటల్ నుండి కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం వెళ్లే ప్రధాన రహదారిపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ,టీకేఆర్ కమాన్ చౌరస్తా నుండి ఓవైసీ హాస్పిటల్ చౌరస్తా వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పేరిట సుమారు 240 ఇండ్ల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నూతన ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న తమ నివాసాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.ప్రస్తుతం 150 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్ అందుబాటులో ఉండగా, మరో 25 ఫీట్ల రోడ్డు విస్తరణ అవసరం ఏమిటని ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత ఈ రహదారి చక్కటి సదుపాయాలతోనే రాబోయే 25 సంవత్సరాల పాటు ట్రాఫిక్ సమస్యలు ఉండని విధంగా ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ అవసరం లేదని స్పష్టం చేశారు.అయితే బండ్లగూడ ఆనంద నగర్ చౌరస్తా, హస్తినాపురం చౌరస్తా వద్ద తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉన్నప్పటికీ అక్కడ ఫ్లైఓవర్ మంజూరు చేయకుండా ఇక్కడ ప్రతిపాదించడం సరైన నిర్ణయం కాదన్నారు.ఈ ఫ్లైఓవర్ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం విరమింపచేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ యొక్క నిర్లక్ష్యంతో... తాగునీరు నేలపాలు



ఎల్బీనగర్, ఏప్రిల్ 21( భారత శక్తి): అసలే భగ్గుమంటున్న ఎండా కాలం ఈ కాలంలో దాహార్తి తీర్చాల్సిన జలమండలి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వలన తాగే నీరు వృధాగా రోడ్ల పాలవుతున్నాయి.మంచినీళ్ల లీకేజ్ కు మరమ్మత్తులు చేసి కూడా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో చేసిన పనికిమాలిన పనికి మళ్ళీ మంచినీరు అంతా లీకై మన్సురాబాద్ డివిజన్ సహారా ఎస్టేట్ రోడ్ లోని జడ్జిస్ కాలనీ రోడ్ నెంబర్ 2 లో నుండి కాలనీ మొత్తం వరదలై పారుతున్న తాగునీరు. పట్టించుకోని జలమండలి అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసులు మండిపడుతున్నారు.

## హయత్‌నగర్ సర్కిల్‌లో జనగణన శిక్షణ ప్రారంభం

- **తొలి విడతలో 38 మంది సూపర్వైజర్లు, 235 మంది ఎన్యూమరేటర్ల నియామకం**



హయత్‌నగర్, ఏప్రిల్ 21 (భారత శక్తి) : జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్ సర్కిల్‌లో మొదటి దశ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. మే 11 నుంచి జూన్ 9 వరకు జరగనున్న గృహ గణన, ఇళ్ల జాబితా రూపకల్పన కోసం ప్రభుత్వం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను, ప్రభుత్వ ఉద్యోగులను ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లుగా నియమించింది. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 38 మంది సూపర్వైజర్లు, 235 మంది ఎన్యూమరేటర్లను ఈ విధులకు కేటాయించారు.

**మూడు రోజుల పాటు శిక్షణ**

బి.ఎన్. రెడ్డి నగర్, చింతలకుంట, వనస్థలిపురం వార్డులకు చెందిన సిబ్బందికి హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 18, 20, 21 తేదీల్లో మొదటి బ్యాచ్ శిక్షణ ఇచ్చారు. జనగణన సమయంలో గృహాల వివరాలను నమోదు చేసే విధానం, ఫారాలను పూర్తి చేసే తీరుపై ఫీల్డ్ ట్రైనర్లు అవగాహన కల్పించారు.

**పాల్గొన్న అధికారులు**

ఈ కార్యక్రమంలో చార్జ్ జనగణన అధికారి, డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దినేష్ సింగ్ పాల్గొన్నారు. వీరితో పాటు: ఇంచార్జి అసిస్టెంట్ కమిషనర్లు: నర్సింగ్ రావు, వెంకన్న. ఫీల్డ్ ట్రైనర్లు: సాయి తరుణ్, కనకయ్య, మల్లికార్జున్, విఘ్నేశ్వరి, లక్ష్మీ దీపక్, శైలజ. టాక్స్ ఇన్‌స్పెక్టర్లు: సుధాకర్, నాగయ్య, ఆయూబ్ ఖాన్, జాహీద్, ఆంజనేయులు. బిల్ కలెక్టర్లు: శివరాజ్, విశ్వజిత్ రెడ్డి, శిరీష యాదవ్, అర్చన, మహేష్ తదితరులు పాల్గొన్నారు. నిర్దేశించిన సమయంలోగా పక్కాగా గణన పూర్తి చేయాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు.



## సాగర్ హైవేపై 'కవితక్క' మద్దతుదారుల హోరు

- **ఇబ్రహీంపట్నంలో వంద బైక్లతో భారీ ర్యాలీ**
- **ఈ నెల 25న మేడ్చల్ వేదికగా కొత్త పార్టీ ప్రకటన!**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 21 భారత శక్తి: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీకి మద్దతుగా రంగారెడ్డి జిల్లాలో పొలిటికల్ హీట్ పెరిగింది. ఈ నెల 25న మేడ్చల్ వేదికగా ఆమె కొత్త పార్టీని ప్రకటించనున్న నేపథ్యంలో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంపాటి పాండురంగారెడ్డి వీచేశారు, మంచిరెడ్డి విజయ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మాల్ గ్రామం నుంచి సాగర్ హైవే మీదుగా నియోజకవర్గ కేంద్రం వరకు సుమారు వందలాది బైక్లతో కార్యకర్తలు ప్రదర్శన చేపట్టారు.

*** అమరుల ఆశయాల కోసమే కొత్త ప్రస్థానం**

ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమ స్ఫూర్తితో, అమరవీరుల ఆశయాలను నిజం చేసే లక్ష్యంతోనే కవిత రాజకీయ ప్రయాణం మొదలవుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సరికొత్త రాజకీయ పంథాకు శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు.

*** మేడ్చల్ సభకు తరలిరావాలి**

జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి, యువజన విభాగం నాయకుడు కర్నాటి చంద్రకాంత్ మాట్లాడుతూ.. 25న మేడ్చల్లో జరిగే చారిత్రాత్మక మహాసభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి యువత, మహిళలు, రైతులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

*** హోరెత్తిన సాగర్ హైవే**

ర్యాలీ పొడవునా కార్యకర్తల నినాదాలతో సాగర్ హైవే ప్రాంతం మారుమోగింది. ఈ కార్యక్రమంలో కంబాలపల్లి చెన్నకిషన్ రెడ్డి, బట్టు దినేష్ రెడ్డి, ఎన్. నవీన్, బి. ప్రవీణ్ రెడ్డి, రాయకంటి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2లోపు 50%ఫిట్మెంట్‌తో
## పీఆర్‌సీ ప్రకటించకుంటే భారీ ఉద్యమిస్తాం

- **ఉద్యోగులు కూడా ప్రజల్లో భాగమే**
- **పీఆర్‌టీయూటీఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి**



గజ్వేల్, ఏప్రిల్ 21 (భారత శక్తి) : పీఆర్‌టీయూ వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మైలారం ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్గల్ మండల శాఖ అధ్యక్షులు తోకల చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించగా, మండల ప్రధాన కార్యదర్శి పారుపల్లి నరసింహ రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఆర్‌టీయూటీఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2లోపు 50% ఫిట్మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పీఆర్‌సీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే బహుమానం కాదని, పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఇది ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పుడు నిధుల కొరతను కారణంగా చూపించడం సరికాదన్నారు. ఉద్యోగులు కూడా ప్రజల్లో భాగమేనని, సంక్షేమ పథకాలకు నిధులు ఉంటే ఉద్యోగుల పీఆర్‌సీకి ఎందుకు ఉండవని ప్రశ్నించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకొస్తే పీఆర్‌సీ అమలు చేయడానికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జూన్ 2లోపు పీఆర్‌సీ ప్రకటించకపోతే ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదే కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి మూడు దశాబ్దాల పాటు అంకితభావంతో సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా నిలిచారని కొనియాడారు.ఈ సభలో ఎస్‌సీఆర్‌టీ మాజీ డైరెక్టర్ ఆనంద్ కిషోర్, పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్, మాజీ ఎంపీపీ నిమ్మ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంఈఓ సునీత, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి కరీముద్దీన్, పత్రికా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొని అభినందనలు తెలిపారు.


## అక్రమ కూల్చివేతలపై అధికారులతో
## సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బడంగ్ పేట్, ఏప్రిల్ 21(భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బడంగ్‌పేట్ పరిధిలో జరుగుతున్న అక్రమ కూల్చివేతలపై, ముఖ్యంగా ఫుట్‌పాత్‌ల తొలగింపులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అలాగే త్రాగునీరు, శానిటేషన్ సమస్యలు, టెండర్లు ఖరారైనప్పటికీ ఇంకా ప్రారంభం కాని అభివృద్ధి పనులు, పూర్తికాని పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య డిఈ, ఏఈ, పోలీస్,టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులు, పేద లాయర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

- **లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్**



హైదరాబాద్, ఏప్రిల్ 21 (భారత శక్తి): ప్రతిరోజూ కోర్టులకు హాజరయ్యే పేద న్యాయవాదులకు, మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం తక్షణమే గౌరవ వేతనం చెల్లించాలని లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఎం. దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

*** అందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు ఇవ్వాలి**

డెస్క్ జర్నలిస్టులతో పాటు ఫీల్డ్‌లో పనిచేసే విలేకరులందరికీ వివక్ష లేకుండా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని దశరథ్ నాయక్ కోరారు. అవినీతిని అరికట్టడంలో, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల రక్షణలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. వృత్తిపరమైన ఒత్తిడి కారణంగా జర్నలిస్టులు అనారోగ్యం బారిన పడుతున్నారని, వారి ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

*** పోలీసులకు జీతాలు పెంచాలి**

పోలీసు శాఖలో హోంగార్డుల నుంచి ఎస్ఐ స్థాయి వరకు సిబ్బంది పగలు, రాత్రి కష్టపడుతున్నారని దశరథ్ నాయక్ పేర్కొన్నారు. వారి కష్టానికి తగ్గట్లుగా ప్రభుత్వ ఉద్యోగుల కంటే అధిక వేతనం చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. పేద లాయర్లు, జర్నలిస్టుల వృత్తిని గౌరవిస్తూ ప్రభుత్వం నెలవారీ భృతిని అందించాలని స్పష్టం చేశారు.

**వరద నివారణ చర్యలు చేపట్టాలి**

నగరంలో వర్షాకాలం రాకముందే ప్రభుత్వం అప్రమత్తం కావాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, వర్షపు నీరు నిలవకుండా సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. ముందస్తు చర్యల ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని ఈ సందర్భంగా దశరథ్ నాయక్ పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీ సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవ వేడుకలు

- **శిశు మందిర్ లో చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి, దేశభక్తిని బోధిస్తాం**
- **మన దేశ సంస్కృతి సంప్రదాయలను నేర్పించే ఏకైక పాఠశాల**
- **డాక్టర్ నరేష్ బాబు**



గజ్వేల్, ఏప్రిల్ 21 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ స్కూల్ వార్షికోత్సవం, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానోపాధ్యాయురాలు హరిణా పవన్ వ్యాఖ్యత గా వ్యవహరించారు, ఈ కార్యమానికి విశిష్ట అతిధిగా విచ్చేసిన సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చదువుతో పాటు సంస్కారం, సంస్కృతి, దేశభక్తిని బోధిస్తారని, మన దేశ సంస్కృతి సంప్రదాయలను నేర్పించే ఏకైక పాఠశాల శ్రీ సరస్వతి శిశు మందిర్ అని, పేర్కొన్నారు, దేశానికి ఎందరినో డాక్టర్ లను, శాస్త్రవేత్తలను, మహానుభావులను అందించిన ఘనత శ్రీ శిశు మందిర్ పాఠశాల కె దక్కిందని కొనియాడారు, ఈ వేడుకలలో చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్కూల్ విద్యార్థి, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, గజ్వేల్ పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.



# బస్సులు బంద్...

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 53 రోజుల చారిత్రాత్మక సమ్మె తర్వాత సంస్థలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా మరోసారి సమ్మెలోకి వెళ్లాయి. సమ్మెలోకి వెళ్తామని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నేతలు ముందుగానే కార్మిక శాఖ ద్వారా నోటీసు ఇచ్చి, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా ప్రభుత్వం సమ్మె నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమ్మె అనివార్యమని నిర్ధారణ కావడంతో హడావిడిగా మంగళవారం మధ్యాహ్నం నాలుగు శాఖల ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో 66 విడుదల చేసింది. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులు వికాస్‌రాజ్, దానకిషోర్, సందీప్‌కుమార్ సుల్తానీయా, ఎండీ వై నాగిరెడ్డి ఉన్నారు. వీరు ఆర్టీసీ కార్మిక సంఘాలను సచివాలయంలో చర్చలకు రావాలని ఆహ్వానించారు. జేఏసీలోని కార్మిక సంఘాలతో పాటు సమ్మెకు మద్దతు తెలుపుతున్న టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎమ్‌యూ (అశ్వత్థామరెడ్డి), ఐఎన్‌టీయూసీ సంఘాలు కూడా చర్చలకు వెళ్లాయి. కమిటీ నూతనంగా ఏర్పడినందున సమస్యల్ని అధ్యయనం చేసేందుకు తమకు నాలుగు వారాల సమయం కావాలని ఐఏఎస్‌ల కమిటీ కోరింది. ఈ ప్రతిపాదనను జేఏసీతో పాటు కార్మిక సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. తమ డిమాండ్లు కొత్తవేం కాదని తేల్చిచెప్పాయి. సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రగా పేర్కొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుంచే కార్మికులంతా సమ్మెలోకి వెళ్తున్నట్టు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఆర్టీసీ కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నారనీ, తమ 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరడతామని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఉద్దేశపూర్వక జాప్యం**

బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 53 రోజులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపింది. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా, ఇప్పటికీ ఆర్టీసీ కార్మికుల ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై కార్మిక సంఘాల వివిధ రూపాల్లో అనేక ఆందోళనలు చేపట్టాయి. సంస్థలో ఇప్పటికీ ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన యూనియన్ల రద్దు ఉత్తర్వులే అమల్లో ఉన్నాయంటూ యాజమాన్యం కార్మికశాఖ వద్ద జరిగే చర్చలకు కూడా హాజరుకాలేదు. అనివార్యంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట పట్టాల్సి వచ్చింది.

**ప్రయాణీకులకు ఇబ్బందులు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో రాష్ట్రంలో పల్లెవెలుగు నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు నిలిచి పోనున్నాయి. దాదాపు 10వేల బస్సుల డిపోలకే పరిమితం అవుతున్నాయి. ఆర్టీసీలోని అద్దె బస్సుల సిబ్బంది కూడా సమ్మెకు సంఘీభావంగా విధులు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సమ్మెతో రాష్ట్రంలో సామాన్య ప్రజలకు రవాణా కష్టాలు తప్పవు.

**97 డిపోల్లో..10 వేల బస్సులు**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి 97 డిపోల్లో 10 వేల బస్సులు ఉన్నాయి. వీటిలో దాదాపు 3,500 అద్దె బస్సులు ఉన్నాయి. సంస్థలో 39 వేల మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బస్సులు రోజుకు 36 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తున్నాయి.

*** సమస్యల పరిష్కారానికి సానుకూలం: మంత్రి పొన్నం**

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోవడంలో కొంత జాప్యం జరిగిందని అంగీకరించారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించేందుకు నలుగురు ఐఏఎస్ అధికారులతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ ప్రతినిధులంతా ఆ కమిటీకి సమస్యలు విన్నవిస్తే, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాను అధికారుల దగ్గర చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు.

## ఇరాన్‌కు మరోసారి
# డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాల్పుల విరమణను పొడిగించడం తనకు ఏమాత్రం ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌కు చర్చలు తప్ప మరో మార్గం లేదని, ఒప్పందం కుదుర్చుకోవాల్సిందేనని తేల్చిచెప్పారు. చర్చల నేపథ్యంలో, ఈ విరామ సమయాన్ని వినియోగించుకుని అమెరికా సైన్యం అదనపు ఆయుధ సామాగ్రిని సమకూర్చుకుంటుందని ఆయన తెలిపారు. ఇరాన్‌పై దాడులు తిరిగి ప్రారంభించేందుకు తమ సైన్యం సిద్ధంగా ఉందని, తాను ఆదేశిస్తే అదే జరుగుతుందని హెచ్చరించారు. తదుపరి చర్చల్లో పురోగతి కనిపిస్తే కాల్పుల విరమణను కొనసాగిస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, కాల్పుల విరమణ కొనసాగించాలనుకోవడం లేదని అన్నారు. తమకు అంత సమయం కూడా లేదని తెలిపారు. కాగా, కాల్పుల విరమణ నేడో, రేపో ముగియనుంది.



# కేరళలో బాణసంచా పేలుడు : 13 మంది మృతి

త్రిస్సూర్, ఏప్రిల్ 21: కేరళలోని ప్రసిద్ధ త్రిస్సూర్ పూరం వేడుకల్లో ఘోర విషాదం చోటుచేసుకుంది. బాణసంచా తయారీ కేంద్రంలో సోమవారం జరిగిన భారీ పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయ ఉత్సవాల్లో ఒకటైన త్రిస్సూర్ పూరం కోసం బాణసంచా సిద్ధం చేస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పేలుడు ధాటికి భారీగా మంటలు ఎగసిపడి, ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకోవడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ప్రతి ఏటా మలయాళ నెల 'మాడం'లో పూరం నక్షత్రం రోజున త్రిస్సూర్‌లోని వడక్కునాథన్ ఆలయంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆసియాలోనే అతిపెద్ద పండుగల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ వేడుకకు పది లక్షలకు పైగా భక్తులు హాజరవుతారు. ఈ ఉత్సవాల్లో బాణసంచా ప్రదర్శన చాలా ప్రత్యేకం. దీనికోసం సిద్ధం చేస్తున్న షెడ్‌లోనే ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులైన వైద్యులను రప్పిస్తామని ఆయన అన్నారు. పోలీస్, ఫైర్, ఆరోగ్య, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల సమన్వయంతో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం త్రిస్సూర్ మెడికల్ కాలేజీలో 13 మంది చికిత్స పొందుతున్నారని, వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. బాణసంచా నిల్వ, నిర్వహణలో భద్రతా లోపాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విషాద ఘటనతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఈ ఉత్సవాలపై విషాద ఛాయలు అలుముకున్నాయి.

# గులాబీ బాస్ కీలక భేటీ

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల సందర్భంగా, పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అత్యున్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా ఈ భేటీ జరగనుంది. పార్టీ సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కేసీఆర్ ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని రీఆర్గనైజ్ చేసే దిశగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జెడ్పీ మాజీ చైర్మన్లను ఆహ్వానించారు.రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, భవిష్యత్ పోరాటాల కోసం శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఒక భారీ యాక్షన్ ప్లాన్‌ను ప్రకటించే అవకాశం ఉంది.

# గోర్కా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం: అమిత్ షా

పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ... గోర్కా వర్గ ప్రజలకు భారీ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దశాబ్దాల కాలం నాటి గోర్కా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు. గోర్కా ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను అర్థం చేసుకోగల ఏకైక పార్టీ బీజేపీయేనని, మరే ఇతర పార్టీ కూడా ఈ సమస్యను పరిష్కరించలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూస్తారని... వారు శాంతియుతంగా జీవించేలా పరిష్కారాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చారు. అయితే, తన ప్రసంగంలో అమిత్ షా ఎక్కడా నేరుగా 'గోర్కాల్యాండ్' లేదా 'ప్రత్యేక రాష్ట్రం' అనే పదాలను వాడకపోవడం గమనార్హం. కేవలం 'సమస్య పరిష్కారం' అనే అంశంపైనే ఆయన దృష్టి సారించారు.

# ముగిసిన ప్రచారం.. ఇక ఓటరు తీర్పే తరువాయి

చెన్నై / కోల్‌కతా, ఏప్రిల్ 21 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల కీలకమైన "నిశ్శబ్ద సమయం" (సైలెన్స్ పీరియడ్) అధికారికంగా ప్రారంభమైంది. దీంతో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా, బెంగాల్‌లో తొలి దశ పోలింగ్ జరగనుంది. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగియనుండటంతో, మార్చి 15న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరపనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో, గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, అన్నాడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీటికి తోడు నామ్ తమిళర్ కట్చి, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలు కూడా స్వతంత్రంగా బరిలో నిలవడంతో ఈసారి చతుర్ముఖ పోటీ ఆసక్తికరంగా మారింది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా అగ్రనేతలంతా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, భారీ బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ప్రచారం ముగియడంతో, స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. తమిళనాడు ముఖ్య ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఏప్రిల్ 21 సాయంత్రం 6 గంటల నుంచి ఏప్రిల్ 23న పోలింగ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఈ నిబంధనల ప్రకారం, బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార సంబంధిత సమావేశాలను నిర్వహించరాదు. టెలివిజన్, రేడియో, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు ఎస్ఎంఎస్‌లు లేదా ఇంటర్నెట్ ద్వారా ఎన్నికల సంబంధిత కంటెంట్‌ను వ్యాప్తి చేయడంపై పూర్తి నిషేధం విధించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో సంగీత, నాటక ప్రదర్శనలు వంటి వినోద కార్యక్రమాలను నిర్వహించడం కూడా నిషిద్ధం. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. నియోజకవర్గంలో ఓటర్లు కాని రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు నిశ్శబ్ద సమయం ప్రారంభం కాకముందే ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు కళ్యాణ మండపాలు, హాస్టళ్లు, అతిథి గృహాలపై నిఘా కట్టుదిట్టం చేశారు. అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లకు జారీ చేసిన వాహన అనుమతులు మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత చెల్లవు. పోలింగ్ రోజున అభ్యర్థులకు పరిమిత సంఖ్యలో వాహనాలకు అనుమతి ఉంటుంది, వాటిని కూడా రిటర్నింగ్ అధికారులు నియంత్రిస్తారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి వాహనాలను అద్దెకు తీసుకోవడం లేదా ఉపయోగించడం పూర్తిగా నిషేధం. అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఇద్దరు వ్యక్తులతో మాత్రమే ఎన్నికల బూత్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడ కూడా జనం గుమిగూడటానికి అనుమతి లేదు.

# సొంతగడ్డపై సన్ రైజర్స్ హ్యాట్రిక్... ఢిల్లీపై అద్భుత విజయం

- **హైదరాబాద్‌లో పరుగుల వరద.. ఢిల్లీపై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ విజయం**
- **విధ్వంసకర సెంచరీతో అదరగొట్టిన ఓపెనర్ అభిషేక్ శర్మ**
- **బౌలింగ్‌లో మలింగ, హర్ష్ దూబే మాయ**
- **ఈ విజయంతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరిన ఎస్ఆర్‌హెచ్**

హైదరాబాద్: ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. సొంత మైదానం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ పరుగుల సునామీ సృష్టించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ అజేయ, విధ్వంసకర శతకంతో కదం తొక్కడంతో, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 47 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై సన్‌రైజర్స్ కు ఇది వరుసగా మూడో విజయం. ఈ విజయంతో ప్లేఆఫ్స్ దిశగా మరో అడుగు వేయడమే కాకుండా, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఫీల్డింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ బ్యాటింగ్ ప్రదర్శన విధ్వంసక రీతిలో సాగింది. ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రత్యర్థి బౌలింగ్ ను ఊచకోత కోశాడు. కేవలం 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో ఢిల్లీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. మరో ఓపెనర్ ట్రావిస్ హెడ్ (37), ఇషాన్ కిషన్ (25) వేగంగా ఆడగా, చివరిలో హెన్రిచ్ క్లాసెన్ (13 బంతుల్లో 37) తనదైన శైలిలో మెరుపులు మెరిపించాడు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ పోరాడినప్పటికీ, క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. నితీశ్ రాణా (30 బంతుల్లో 57), సమీర్ రిజ్వీ (41), కేఎల్ రాహుల్ (37) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా సన్‌రైజర్స్ బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. యువ పేసర్ ఎషాన్ మలింగ తన పదునైన బౌలింగ్‌తో ఢిల్లీ పతనాన్ని శాసించాడు. కీలకమైన డేవిడ్ మిల్లర్ (0), ట్రిస్టన్ స్టబ్స్ (27) సహా మొత్తం 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డి విరిచాడు. మరోవైపు, యువ స్పిన్నర్ హర్ష్ దూబే తన మాయాజాలంతో ఆకట్టుకున్నాడు. కేవలం 2 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసి ఢిల్లీ ఓటమిని ఖాయం చేశాడు. దీంతో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 195 పరుగులకే పరిమితమైంది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 7 మ్యాచ్‌లలో 4 విజయాలు, 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించడం ఆరెంజ్ ఆర్మీ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

# ఎన్డీయేతోనే తమిళనాడుకు పూర్వ వైభవం: సీఎం చంద్రబాబు

అమరావతి : అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాల కల్పన జరగాలంటే అది ఒక్క ఎన్డీఏతోనే సాధ్యమని, తమిళనాడు రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురాగల శక్తి ఎన్డీఏ కూటమికి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు చెన్నైలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎంకే, కాంగ్రెస్ పార్టీల వైఖరిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల వల్ల రాష్ట్రం ఎలా నష్టపోతుందో వివరించారు.

*** రాహుల్, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లుల విషయంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేశాయని చంద్రబాబు ఆరోపించారు. "మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రాన్ని ఓడించామని డీఎంకే, కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలు భావిస్తున్నాయి. కానీ వాస్తవానికి వారు ఈ దేశ మహిళలను, దక్షిణాది రాష్ట్రాలను ఓడించారు. జనాభాతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా 50 శాతం పెంచాలనేది కేంద్రం ప్రతిపాదన. ఆ పెరిగిన సీట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయి. దీనివల్ల దక్షిణాదికి ఎలాంటి నష్టం లేదు. ఈ ఫార్ములా కంటే మెరుగైనది మరొకటి ఉంటుందా? అయినా, కేవలం రాజకీయ కారణాలతో ఈ రెండు బిల్లులను అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ దీని ద్వారా ఏం సాధించారు?" అని చంద్రబాబు ప్రశ్నించారు. "సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నేను దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా ఎందుకు ఆలోచిస్తాను? నేను దక్షిణాది వైపే మాట్లాడుతున్నాను. 2001లో వాజ్‌పేయి హయాంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రతిపాదన వస్తే, అది దక్షిణాదికి నష్టమని చెప్పి నేనే ఆపించాను. ఈ విషయాన్ని ఇండియా కూటమి పార్టీలు గుర్తుంచుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

**తమిళనాడుకు గత వైభవమేదీ?**

ఒకప్పుడు దక్షిణ భారతదేశానికే కేంద్రంగా ఉన్న చెన్నై, ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడలేకపోతోందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "తమిళనాడులో అభివృద్ధి ఆగిపోయింది. శాంతిభద్రతలు క్షీణించాయి. మహిళలపై నేరాలు, కస్టోడియల్ మరణాలు, డ్రగ్స్ వాడకం పెరిగిపోయాయి. గతంలో తమిళనాడుకు గొప్ప చరిత్ర ఉండేది. కానీ ఇప్పుడా పరిస్థితి ఉందా? జరిగిన కొద్దిపాటి అభివృద్ధి కూడా కేంద్ర నిధుల వల్లే. చెన్నై రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, చెన్నై బెంగళూరుఅమరావతి హైస్పీడ్ రైలు కారిడార్ వంటివి కేంద్రం చొరవే. డీఎంకే లాంటి పార్టీల వల్ల రాష్ట్రం వెనుకబడుతోంది" అని విమర్శించారు.

**ఇప్పుడు ఏపీని చూడండి**

కేంద్ర సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఎలా అభివృద్ధి పథంలో పయనిస్తోందో చంద్రబాబు వివరించారు. "దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. డబ్బులు లేకున్నా, ల్యాండ్ పూలింగ్ వంటి వినూత్న పద్ధతిలో రాజధాని నిర్మిస్తున్నాం. ఇదంతా కేంద్రం సహకారంతోనే సాధ్యమైంది. తమిళనాడులోనూ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి జరుగుతుంది" అని ఆయన భరోసా ఇచ్చారు.

**భాషా రాజకీయాలు వద్దు**

ప్రధాని మోదీపై వ్యతిరేకతతో భాషాపరమైన బేధాలు సృష్టించడం సరికాదని చంద్రబాబు హితవు పలికారు. "మాతృభాషను గౌరవించాలి, కానీ ఇతర భాషలపై ద్వేషం వద్దు. హిందీని కేంద్రం జాతీయ భాషగా ప్రకటించలేదు. ప్రధాని మోదీ సైతం మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని చెబుతున్నారు. భాష పేరుతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు" అని అన్నారు. నదుల అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి కష్టాలు తీరతాయని, అది ఎన్డీఏతోనే సాధ్యమని తెలిపారు. తిరువళ్లువార్ నుంచి అబ్దుల్ కలాం వరకు ఎందరో మహనీయులు పుట్టిన ఈ గడ్డపై ప్రజలు పురోగామి ఆలోచనలతో ఎన్డీఏకు మద్దతివ్వాలని కోరారు.

# నిబంధనలు 'బేఖాతరు'.. అడ్డదారిలో అడ్మిషన్ల జోరు!

* **ఎస్ . ఆర్ గాయత్రి విద్యాసంస్థల బరితెగింపు: అనుమతులు లేని భవనంలోకి కళాశాల మార్పు?**
* **నివాస గృహ అనుమతులతో విద్యాసంస్థ నిర్మాణం.. గాలికి ఫైర్ సేఫ్టీ, మున్సిపల్ నిబంధనలు!**
* **ఎల్బీనగర్ సాగర్ కాంప్లెక్స్ లో విద్య అక్రమ వ్యాపారం..!**
* **మామూళ్ల మత్తులో..మున్సిపల్ అధికారులు విద్యాధికారులు..!**
* **ఇంటర్ బోర్డ్ కమిషనర్ , విద్యాశాఖ మాత్యులు సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!**

హైదరాబాద్ ఏప్రిల్ 21 (భారత శక్తి) : విద్యాసంస్థలంటే క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలి. కానీ, లాభాలే పరమావధిగా భావిస్తున్న కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు చట్టాలను తుంగలో తొక్కడమే కాక, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. చంపపేట్ నుంచి సాగర్ కాంప్లెక్స్ (శ్రీ గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆర్చ్ రోడ్) సమీపంలోని ఒక అనధికార నిర్మాణంలోకి 'ఎస్సార్ గాయత్రి' జూనియర్ కళాశాలను తరలిస్తున్నట్లు సాగుతున్న ప్రచారం ఇప్పుడు సంచలనంగా మారింది. కనీస అనుమతులు లేకుండా, నిర్మాణ పనులు పూర్తికాకుండానే అడ్మిషన్ల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది.

* **అనుమతులు నివాసానికి.. పాఠాలు కళాశాలలోనా?**

మున్సిపల్ నిబంధనల ప్రకారం విద్యాసంస్థలు నడపాలంటే కమర్షియల్ లేదా ఇన్స్టిట్యూషనల్ పర్మిషన్ ఉండాలి. కానీ, సదరు భవనం కేవలం నివాస అవసరాల కోసమే అనుమతులు పొంది, గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణంలోనే భారీ ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిల్డింగ్ ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ (OC) లేకుండా, ఫైర్ ఎన్ఓసీ (Fire NOC) రాకుండానే ఒక జూనియర్ కళాశాలను అక్కడ ఎలా ప్రారంభిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నిబంధనల ఉల్లంఘన చట్టపరమైన చిక్కులు* తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా బోర్డు నిబంధనల ప్రకారం, ఒక కొత్త కళాశాల ప్రారంభించాలన్నా లేదా ఉన్న కళాశాలను మార్చాలన్నా కఠినమైన 16 రకాల ప్రమాణాలను




పాటించాలి. ఎస్సార్ గాయత్రి యాజమాన్యం వీటిని బేఖాతరు చేస్తున్నట్లు కనిపిస్తోంది:

* మున్సిపల్ చట్టాల ఉల్లంఘన: జిహెచ్ఎంసి నుండి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణంలో ప్రమాదకరమైన నీవు నిర్మాణంలో కాలేజీ నిర్వహణ, 'తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019' ప్రకారం నేరం.
* ఫైర్ సేఫ్టీ ఉల్లంఘన: అగ్నిమాపక నిబంధనలు పాటించని భవనాల్లో విద్యాసంస్థలు నడపడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం.

* **విద్యా చట్టాల ధిక్కరణ:**

* 8000 చ.అడుగుల RCC ఏరియా, కార్పస్ ఫండ్, శానిటరీ సర్టిఫికేట్ వంటివి లేకుండా బోర్డు అనుమతి రాదు. అనుమతి లేకుండా తరగతులు నిర్వహించడం 'ఆంధ్రప్రదేశ్/తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982' లోని సెక్షన్ 20 ప్రకారం దండనార్హం.

* **అసమర్థతే పెట్టుబడిగా.. 'మనీ, మజిల్' పవర్!**

"డబ్బు, రాజకీయ పలుకుబడి ఉంటే చట్టాలను చుట్టేయవచ్చు" అనే ధీమా యాజమాన్యంలో కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. నిర్మాణ పనులు జరుగుతుండగానే అడ్మిషన్లు తీసుకోవడం విద్యార్థుల భద్రతను ప్రమాదంలోకి నెట్టడమే. ఇంత జరుగుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు, మున్సిపల్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటోనని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

* **ప్రశ్నార్థకమైన అనుమతులు: ఇవి ఉన్నాయా?**

1. మున్సిపల్ శాఖ జారీ చేసిన కమర్షియల్ బిల్డింగ్ ప్లాన్ ఎక్కడ..?
2. అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఫైర్ సేఫ్టీ సర్టిఫికేట్ ఎక్కడ..?
3. ఇంజనీరింగ్ విభాగం ఇచ్చిన స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికేట్ ఎక్కడ..?
4. ఇంటర్ బోర్డు జారీ చేసిన షిఫ్టింగ్ ఆర్డర్ లేదా గుర్తింపు పత్రం ఎక్కడ..?

**అడ్మిషన్లు ఆపేదెవరు?**

తప్పుదోవ పట్టించే ప్రచారాలతో, అసంపూర్తి భవనాల్లో అడ్మిషన్లు చేపడుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. విద్యార్థుల భవిష్యత్తు, భద్రతతో ముడిపడిన ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకోకపోతే, భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అడ్డదారిలో సాగుతున్న ఈ అడ్మిషన్ల పర్వానికి బ్రేక్ వేయాల్సిన సమయం ఆసన్నమైంది.



# పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా చక్రస్నానం..


కాప్రా, భారతశక్తి: కాప్రా చెన్నకేశవ స్వామి ఆలయంలో 14 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన శ్రీ జయమంగళ పంచముఖ ఆంజనేయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా సుదర్శన హోమం, హనుమాన్ హోమం, జాంబవంతుని హోమం, చక్ర స్నానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సమీప కాలనీల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, విశ్వహిందూ పరిషత్ ఆల్ ఇండియా గవర్నింగ్ కమిటీ సభ్యులు రాఘవులు, రాష్ట్ర గవర్నింగ్ కమిటీ సభ్యులు లక్ష్మీ శేఖర్, మాజీ కార్పొరేటర్ మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, ఈఓ కృష్ణమా చార్యులు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, డాక్టర్ కొండారెడ్డి, డీఎన్ ప్రసాద్, కమిటీ మాజీ సభ్యులు పీసర మల్లారెడ్డి, నరేందర్ గౌడ్, శంకర్ బాబు, మురళి పంతులు, విజయేందర్ రెడ్డి, మోహన్, గజేందర్ రెడ్డి, ఆలయ జూనియర్





అసిస్టెంట్ టి. శ్రీనివాస్, ముఖేష్, మోహన్, విశ్వం తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సోలిస్ కంటి ఆసుపత్రి సిబ్బంది సేవలు అందజేశారు.

# హైడ్రా ముందు అమీన్‌పూర్ బాధితుల ఆర్తనాదం






హైదరాబాద్, ఏప్రిల్ 21 (భారతశక్తి) : "వందల మందరం.. అందరం ముఖీం అనుచరుల చేతిలో మోసపోయాం. 'పెద్ద లాయర్ మా వెనుక ఉన్నారు, మీకేం కాదు.. మేము చూసుకుంటాం' అని నమ్మబలికి మాకు 70 గజాల చొప్పున ప్లాట్లు అమ్మేశారు. అది ప్రభుత్వ భూమి అని మాకు తెలియదు. అందరూ కొంటున్నారు కదా అని మేమూ కొన్నాం. ఇప్పుడు వారిని నిలదీస్తే.. 'మాకేం తెలియదు, ఖాళీ స్థలం ఉంచొద్దు వెంటనే ఇల్లు కట్టుకోమని చెప్పినా మీరు వినలేదు' అంటూ తిరిగి మమ్మల్నే దబాయిస్తున్నారు. మా డబ్బులు మాకు ఇచ్చేయమని అడిగితే.. ఎప్పుడో ఎవరి వాటాలు వారికి వెళ్లిపోయాయి, మా దగ్గర లేవు అని తప్పించుకుంటున్నారు. నోటరీలు, అగ్రిమెంట్ పత్రాలను పరిశీలించి ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి" అంటూ అమీన్‌పూర్ బాధితులు సోమవారం 'హైడ్రా' ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కురుమ మల్లేష్, మాణిక్ యాదవ్, రవి నాయక్, రామచంద్ర నాయక్ తదితరులు ముఖీం అనుచరులుగా వేర్వేరు పేర్లతో అగ్రిమెంట్లు, నోటరీలు చేసి తమకు భూములు విక్రయించారని బాధితులు పేర్కొన్నారు. కూలీ పనులు చేస్తూ, చిట్టీలు వేసుకుని, గ్రామాల్లో ఉన్న కొద్దిపాటి పొలాన్ని అమ్ముకుని ప్లాట్లు కొన్నామని, ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

**కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, యూఎల్సీ, అసైన్డ్ భూములు కబ్జాలకు గురవుతున్నాయంటూ ప్రజావాణికి భారీగా ఫిర్యాదులు అందాయి.

* దుండిగల్: ఔటర్ రింగురోడ్డు నిర్మాణ సమయంలో సేకరించిన అసైన్డ్ భూముల్లో మట్టిని అమ్ముకున్న వారే, ఇప్పుడు ఆ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని దుండిగల్ గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఆ భూములు అసైనీలకు దక్కాలి లేదా ప్రభుత్వం వద్ద ఉండాలి కానీ, కబ్జాదారుల పాలు కావొద్దని కోరారు.
* బ్లూ సీ హోటల్ ప్రాంతం: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని బ్లూ సీ హోటల్ వెనుక ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరారు. ఆ భూమి కోసం కొందరు పరస్పరం కేసులు వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని, అక్కడ పార్కును అభివృద్ధి చేయాలని విన్నవించారు.
* బాచుపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి సర్వే నంబరు 54లోని రెండెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని ఫిర్యాదు అందింది.
* మియాపూర్: శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వే నంబరు 100, 101లోని ఎకరం ప్రభుత్వ భూమిని స్థానికులు కబ్జా చేస్తున్నారని 'శ్రీ శక్తి మహిళా మండలి' ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
* బేగంపేట: బ్రాహ్మణవాడి సర్వే నంబరు 210లోని 3 వేల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.
* సైదాబాద్: ఫిష్ మార్కెట్ వద్ద ఉన్న 4,083 గజాల ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని కోరుతుంటే, కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలతో కోర్టుకు వెళ్లారని స్థానికులు ఆరోపించారు.

ఈ ఫిర్యాదులను పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, వీటి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.




# లబ్ధిదారులు ఉండకపోతే ఇండ్లు రద్దు

* **వెంటనే నివాసం ఉండాల్సిందే**
* **కొత్త వారికి కేటాయించాలని కలెక్టర్ ఆదేశం**
* **ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ప్రక్రియ వేగవంతం**

రంగారెడ్డి, ఏప్రిల్ 21 (భారత శక్తి): డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పొందిన లబ్ధిదారులు వెంటనే వాటిలోకి చేరాలని, లేనిపక్షంలో కేటాయింపులను రద్దు చేస్తామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు.

**నివాసం లేకుంటే నోటీసులు**

జిల్లాలో ఇప్పటికే పూర్తయిన మరియు నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గతంలో ఇండ్లు పొంది, ఇప్పటికీ అక్కడ నివసించని వారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. నోటీసుల తర్వాత



కూడా నివాసం ఉండని వారి పట్టాలను రద్దు చేసి, ఆ ఇండ్లను కొత్త వారికి కేటాయించాలని స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు.

**ఎల్-2 జాబితా ఆధారంగా ఎంపిక**

ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్ 2 (L2) జాబితా నుంచి అత్యంత పేదవారిని ఎంపిక చేసి ఇండ్లు కేటాయించాలని ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా కేటాయింపుల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్, హౌసింగ్ పీడీ డి. చాంప్లా నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 25న కల్వకుంట్ల కవితక్క కొత్త పార్టీ!

* **ఆవిర్భావ పోస్టర్‌ను విడుదల చేసిన బీసీ నేత అల్లంపల్లి రామకోటి**

హైదరాబాద్, ఏప్రిల్ 21 (భారత శక్తి): తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఈనెల 25న నూతన రాజకీయ పార్టీ ఆవిర్భవించబోతోంది. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**పార్టీ ఆశయాలు ఇవే..**

గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ జాగృతి ద్వారా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్న కవిత, ఇకపై రాజకీయ వేదిక ద్వారా ప్రజలకు చేరువ కావాలని నిర్ణయించుకున్నట్లు రామకోటి తెలిపారు. ఈ కొత్త పార్టీ ప్రధానంగా కింది అంశాలపై దృష్టి సారిస్తుందని ఆయన




పేర్కొన్నారు:

* మహిళా సంక్షేమం: రాష్ట్రంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేయడం.
* బీసీల గొంతుక: వెనుకబడిన తరగతుల హక్కుల కోసం పోరాటం.
* విద్యార్థి, నిరుద్యోగ సమస్యలు: నిరుద్యోగులకు ఉపాధి కల్పన, విద్యార్థుల సమస్యల పరిష్కారం.
* రైతు భరోసా: కన్నీళ్లు లేని వ్యవసాయాన్ని అందించడం.

**పాలనలో మార్పు కోసమే..**

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై రామకోటి విమర్శలు గుప్పించారు. పన్నులు కట్టేది ఒకరైతే, భోగాలు అనుభవించేది మరొకరు అన్నట్లుగా పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. "అహంకారపూరిత పాలనకు అంతం పలకాల్సిన సమయం ఆసన్నమైంది. ఒక మహిళా ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో అవినీతి, భూకబ్జాలు, వివక్ష అంతమవుతాయి. ఇల్లు చక్కదిద్దే గృహిణిలా రాష్ట్రాన్ని కవిత అభివృద్ధి పథంలో నడిపిస్తారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

* **భారీ బహిరంగ సభకు సన్నాహాలు:**

ఈనెల 25న జరగనున్న పార్టీ ఆవిర్భావ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేధావులు, ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు మరియు మహిళలు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.




# సీనియర్ సిటిజన్లకు 'ఆసరా' కార్డుల పంపిణీ

సరూర్ నగర్, ఏప్రిల్ 21 (భారత శక్తి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సరూర్ నగర్ పరిధిలోని వృద్ధులకు ఆసరా సీనియర్ సిటిజెన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. మంగళవారం సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు ఈ గుర్తింపు కార్డులను వినియోగించుకుని ప్రభుత్వం కల్పించే వివిధ రాయితీలను పొందాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ సిబ్బంది, ఆర్పీలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.